http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 21 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5   వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి



- తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి
- కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి
- కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ

హైదరాబాద్

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి - మిగతా3లో

## పీఎం కిసాన్ నిధులు విడుదల



- 23వ విడతలో ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ
- దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి
- గత ప్రభుత్వం భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రక్రియను అడ్డుకుందన్న మోదీ
- ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ ప్రధాని

## హైదరాబాద్ వాసుల కోసం క్యూర్ 1 యాప్

### బిల్లులన్నీ ఒకే చోట చెల్లించే అవకాశం




- హైదరాబాద్ క్యూర్ పరిధిలో బిల్లుల చెల్లింపునకు క్యూర్ 1 యాప్
- జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో వినియోగం
- 90 రోజుల్లో అన్ని విభాగాలు అమలు చేయాలని సర్కార్ ఆదేశాలు
- యాప్ నిర్వహణ బాధ్యతను సీజీజీ, మీసేవలకు అప్పగించిన ప్రభుత్వం
- సమన్వయం కోసం ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు

హైదరాబాద్

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజలు వివిధ బిల్లులు చెల్లించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక యాప్ సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో క్యూర్ వన్ యాప్ - మిగతా3లో

## పిల్లల భవిష్యత్తుతో జూదం ఆడొద్దు



- నీట్ పరీక్ష కేంద్రం వివాదంపై రాహుల్ ఫైర్
- నాగ్‌పూర్ విద్యార్థికి అబుదాబి పరీక్ష కేంద్రం కేటాయింపుపై కేంద్రంపై రాహుల్ విమర్శలు
- విద్యార్థులు, తల్లిదండ్రుల సహనాన్ని ఎన్‌టీఏ పరీక్షిస్తోందంటూ వ్యాఖ్యలు

## 8వ పే కమిషన్ కీలక దశ పూర్తి

- ఉద్యోగుల డిమాండ్ల పరిశీలన షురూ
- వినతుల స్వీకరణ పూర్తి చేసిన 8వ వేతన సంఘం
- అధిక ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఉద్యోగ సంఘాల డిమాండ్
- 55 లక్షల ఉద్యోగులు, 69 లక్షల పెన్షనర్లకు లబ్ధి చేకూరే అవకాశం
- దేశవ్యాప్తంగా ఉద్యోగ సంఘాలతో కమిషన్ సంప్రదింపులు



## ఎల్‌పీజీ కోసం భారత్ కొత్త దారులు



- భారీ నష్టాల్లో చమురు సంస్థలు
- పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అమెరికా నుంచి భారీగా ఎల్‌పీజీ దిగుమతులు
- అధిక ధరలతో దేశీయంగా భారీగా తగ్గిన ఎల్‌పీజీ వాడకం

## మెట్రో రైలు రాష్ట్రానికి అత్యంత కీలకం



- 'అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయండి'
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మరో లేఖ
- పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- ముఖ్యంగా ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 అంశాలపై చర్చించాలని వినతి

హైదరాబాద్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మరోసారి లేఖ రాశారు. ఈమేరకు మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 అంశాలపై చర్చించాలని అందులో కోరారు. ఈనెల 16న ఇదే విషయమై కిషన్ రెడ్డికి లేఖ రాసినట్లు గుర్తు చేసిన రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సమావేశం ఏర్పాటు చేయాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. జూన్ 22,23 తేదీల్లో తాను దిల్లీలో ఉంటానని కిషన్ రెడ్డికి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తామిద్దరం కలిసి అశ్వినీ వైష్ణవ్‌ను - మిగతా3లో

## కాంగ్రెస్ పాలనలో వెనుకబడ్డ తూర్పు భారత్

- ఇప్పుడు అభివృద్ధికి ద్వారంగా మారింది: మోదీ
- ఒడిశాలో రూ.47,600 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రారంభం
- కాంగ్రెస్ పాలనలో తూర్పు భారత్ నిర్లక్ష్యానికి గురైందని ప్రధాని విమర్శ



## భారత్ ధర్మసత్రం కాదు



- అమిత్ షా వ్యాఖ్యలు
- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన


## కాంగ్రెస్ నాయకులను ఎక్కడికి అక్కడ నిలతీయండి



- పంటలు కొనుగోలు చేయకుంటే కాంగ్రెస్ నేతల కాలర్ పట్టుకోండి
- ఈరోజు రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిన హత్యలే
- రెండేళ్లు రైతన్నలు ధైర్యంగా ఉండండి
- మళ్లీ కేసీఆర్ వస్తాడు ఒక్కొక్క రైతన్నను కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాడు
- కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం అస్తవ్యస్తమైంది ?
- సంక్షోభంలో కురుకుపోయింది ప్రాణాలు తీసుకుని కుటుంబాలను అనాధలు చేయవద్దు

## ఇంకా విస్తరించని నైరుతి రుతుపవనాలు

- 429 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం
- ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించని నైరుతి రుతుపవనాలు
- 25 జిల్లాల్లోని 429 మండలాల్లో లోటు వర్షపాతం
- 17 జిల్లాల్లోని 59 మండలాల్లో తీవ్రమైన వడగాలులు
- ఆశించినంత అందుబాటులో లేని వర్షపాతం



# పీఎం కిసాన్ నిధులు విడుదల

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో జరిగిన బంగాల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో 23వ విడత కింద మొత్తం రూ.18,880 కోట్లలను విడుదల చేశారు. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. పీఎం- కిసాన్ నిధులతో పాటు రూ.590 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడారు. “ఎన్నికల అనంతరం బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మొదటిసారిగా మీ ముందుకు వచ్చే భాగ్యం ఈరోజు నాకు కలిగింది. బంగాల్‌కు మళ్లీ పూర్వ వైభవం వస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. సంకెళ్లు తెంచుకుని బంగాల్ సరికొత్త అభివృద్ధి పథంలో పయనిస్తోంది. బంగాల్ గాలిలో ఓ స్వచ్ఛత, ప్రజల ముఖాల్లో కొత్త కాంతి, నమ్మకం స్పష్టంగా తెలుస్తోంది. ఓటు ఎలాంటి మార్పును తీసుకురాగలదో బంగాల్‌ను చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. రాష్ట్రంలో జరుగుతున్న మార్పు ప్రజాస్వామ్య ప్రక్రియ శక్తిని నిరూపిస్తోంది. “



**గత ప్రభుత్వం సరిహద్దు కంచె ప్రక్రియను అడ్డుకుంది!**

మరోవైపు, భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సరిహద్దు కంచె నిర్మాణం గురించి మోదీ ప్రస్తావించారు. గత ప్రభుత్వం ఈ ప్రక్రియను అడ్డుకుందని ఆరోపించారు. అయితే, బంగాల్?లో నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం ఆ ప్రక్రియ తిరిగి ప్రారంభించిందని తెలిపారు. అలాగే, రాష్ట్రంలో అవినీతి, ప్రజల నిధులను దోచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు మోదీ పేర్కొన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్, ఆ తర్వాత వామపక్షాలు, ఆపై టీఎంసీ అధికారంలో ఉన్నప్పటికీ, బంగాల్‌ను అభివృద్ధి చేయలేదని మోదీ విమర్శించారు. బదులుగా, వారు దానిని అక్రమ చొరబాటుదారులకు కేంద్రంగా మార్చేశారని ఆరోపించారు. భారతదేశ అభివృద్ధికి దిక్సూచిగా నిలవగలిగే సామర్థ్యం ఉన్న బంగాల్, ముందుకు సాగడానికి బదులుగా వెనుకబడిపోయిందన్నారు.

**దేశ విభజన సమయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ పాత్ర కీలకం**

ఇదిలా ఉండగా, శ్యామా ప్రసాద్ ముఖర్జీకి మోదీ నివాళులర్పించారు. దేశ విభజన సమయంలో బంగాల్‌లోని కొంత భాగం భారతదేశంలోనే ఉండేలా చూడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. “బంగాల్‌ను పాకిస్థాన్‌లో భాగం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, కాంగ్రెస్ ఆ కుట్రపూరిత శక్తుల ముందు తలొగ్గింది. ఆ సమయంలోనే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దీనికి వ్యతిరేకంగా గళమెత్తారు. 1947 ఏప్రిల్‌లో ఆయన ఒక చారిత్రాత్మక తీర్మానాన్ని ఆమోదింపజేశారు. బంగాల్ మొత్తం పాకిస్థాన్‌లో భాగం కాదని ప్రకటించారు. ఫలితంగా, బంగాల్‌ను విభజించాలని భావించిన వారికి అది సాధ్యం కాదని అర్థమైంది. తద్వారా బంగాల్ దేశంలోనే నిలిచిపోయింది. స్వాతంత్ర్యం తర్వాత రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి కూడా, దానిని కాపాడిన అదే స్ఫూర్తి అవసరమైంది” అని మోదీ పేర్కొన్నారు. ఇక, బంగాల్ దినోత్సవానికి ఉన్న ప్రాధాన్యాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. బంగాల్? రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన పరిస్థితుల గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వలస పాలన కాలంలో బంగాల్ అపారమైన బాధలను అనుభవించిందని, ఆ ప్రాంతం ఎన్నో త్యాగాలు చేసిందని, తీవ్రమైన కష్టాలను భరించిందని తెలిపారు. అంతకుముందు, రైల్వేలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశుసంవర్ధక రంగాల్లో దేశవ్యాప్తంగా వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పనులను మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. బంగాల్ అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని మోదీ అన్నారు.

# కాంగ్రెస్ పాలనలో వెనుకబడ్డ తూర్పు భారత్

కాంగ్రెస్ పాలనలో తూర్పు భారత్ అభివృద్ధికి దూరంగా ఉండిపోయిందని, అయితే ప్రస్తుతం అదే ప్రాంతం దేశ ప్రగతి, అభివృద్ధికి ప్రధాన ద్వారంగా మారుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా రైరంగ్‌పుర్‌లో నిర్వహించిన 'వికాస్ రా ధారా ఒడిశా సారా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలకు సంబంధించిన సుమారు రూ.47,600 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలో మాట్లాడిన ప్రధాని మోదీ, తూర్పు భారత అభివృద్ధినే దేశ అభివృద్ధికి పునాదిగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. అందుకే పూర్వోదయ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన తూర్పు రాష్ట్రాలు ఇప్పుడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.

ఒడిశా వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను అవకాశాలుగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని, కొత్త పరిశ్రమలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఉత్కర్ష్ ఒడిశా వంటి కార్యక్రమాల ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు రాష్ట్రానికి వచ్చాయని వెల్లడించారు.




**రాష్ట్రపతికి శుభాకాంక్షలు**

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ప్రధాని. ఒడిశా కుమార్తెగా ప్రారంభమైన ఆమె ప్రయాణం దేశ అత్యున్నత పదవికి చేరుకుందని కొనియాడారు. రాష్ట్రపతి వ్యక్తిత్వం, సేవా భావం, అంకితభావం మయూర్‌భంజ్ మాత్రమే కాకుండా మొత్తం ఒడిశా గుర్తింపును మరింత బలోపేతం చేశాయని చెప్పారు. 'ఈ రోజు రాష్ట్రపతి జన్మదినం కావడం విశేషం. ఆమె స్వగ్రామానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసే అవకాశం నాకు లభించింది. రాష్ట్రపతితో కలిసి పహాడ్‌పుర్ గ్రామాన్ని కూడా సందర్శించాను' అని మోదీ తెలిపారు.

**పహాడ్‌పుర్‌కు సోలార్ విలేజ్ గుర్తింపు**

పహాడ్‌పుర్ గ్రామాన్ని త్వరితగతిన సోలార్ విలేజ్?గా అభివృద్ధి చేస్తామని ప్రధాని ప్రకటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. కోణార్క్ సూర్యదేవాలయానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే, పహాడ్‌పుర్ కూడా భవిష్యత్తులో సోలార్ విలేజ్?గా ప్రత్యేక స్థానం సంపాదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**గిరిజన యువతకు అవకాశాలు**

గిరిజన సమాజ అభ్యున్నతి కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్య అంశమని ప్రధాని స్పష్టం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విద్యాసంస్థలు గిరిజన విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**మయూర్‌భంజ్‌తో ప్రత్యేక అనుబంధం**

మయూర్‌భంజ్ ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని ప్రధాని అన్నారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలే తనను పదేపదే ఈ ప్రాంతానికి రప్పిస్తున్నాయని చెప్పారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా ప్రజల మధ్యకు రావడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందన్నారు.

**పండుగల సందడిలో అభివృద్ధి వేడుక**

ప్రస్తుతం ఒడిశా పండుగల సంబరాల్లో మునిగిపోయిందని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల గణ్ పర్బా ఉత్సవాలు ఘనంగా జరిగాయని, ఇప్పుడు జగన్నాథుడి రథయాత్రకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. మయూర్‌భంజ్‌లో జరిగే బారిపద రథయాత్రపై కూడా ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందన్నారు. ఈ పండుగల వాతావరణంలోనే అభివృద్ధి, ప్రజాస్వామ్య ఉత్సవం కూడా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు.

**రాష్ట్రపతి-ప్రధాని ప్రత్యేక పూజలు**

కార్యక్రమానికి ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి మయూర్‌భంజ్ జిల్లాలోని పహాడ్‌పుర్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ గిరిజనుల పవిత్ర ఆరాధనా స్థలాలైన సంతాలి జాహిరా, హో జాహిరా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. ఒడిశాలో మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, విద్య, శక్తి రంగాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు. తూర్పు భారత అభివృద్ధే దేశ భవిష్యత్తుకు కీలకమని పేర్కొంటూ, ఒడిశా ఆ మార్పుకు కేంద్రబిందువుగా మారుతోందని అన్నారు.


# 8వ పే కమిషన్ కీలక దశ పూర్తి..

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం తన కార్యకలాపాలను వేగవంతం చేసింది. ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నుంచి వినతులు, మెమొరాండంలు స్వీకరించే ప్రక్రియ జూన్ 15వ తేదీతో ముగిసింది. ప్రస్తుతం ఈ డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో కమిషన్ నిమగ్నమైంది. తుది సిఫార్సులు చేసే ముందు ఈ డిమాండ్లన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేయనుంది.

2025 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌కు, తన నివేదికను పూర్తి చేయడానికి దాదాపు 10 నెలల సమయం కేటాయించారు. ఈ సిఫార్సుల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 55 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల వేతనాలు, పెన్షన్లు, ఇతర అలవెన్సులలో మార్పులు జరగనున్నాయి. దీంతో కోటి మందికి పైగా ప్రజలు ఈ కమిషన్ సిఫార్సుల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

**ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఉద్యోగ సంఘాలు తమ మెమొరాండంలలో ప్రధానంగా కొన్ని కీలక అంశాలను ప్రస్తావించాయి. ముఖ్యంగా, జీతాల పెంపులో కీలకమైన ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని సంఘాలు 3.15 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను అమలు చేయాలని కోరుతున్నాయి. దీంతో పాటు కనీస మూల వేతనాన్ని భారీగా పెంచాలని కూడా విజ్ఞప్తి చేశాయి.



అంతేగాక ప్రస్తుతం అమలులో ఉన్న జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. వీటితో పాటు ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ), రిస్క్ పే, బోనస్‌లు, సెలవు ప్రయోజనాలు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను మెరుగుపరచాలని కోరాయి.

**ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌పైనే ఉత్కంఠ**

వేతన సవరణలో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అత్యంత కీలకం. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత మూల వేతనాన్ని కొత్త వేతన స్కేల్‌కు మార్చడానికి ఉపయోగించే గుణకాన్నే ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అంటారు. ఈసారి ప్రభుత్వం 2.5 కంటే ఎక్కువ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రకటించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఉద్యోగ సంఘాలు మాత్రం 3.15 ఆశిస్తున్నాయి. దీనిపై కమిషన్ ఏ మేరకు సిఫార్సు చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కమిషన్ ఢిల్లీ, లడఖ్, జమ్మూ కశ్మీర్, హైదరాబాద్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాలలో సంప్రదింపులు పూర్తి చేసింది. రానున్న రోజుల్లో జూలై వరకు లక్నో, భువనేశ్వర్, కోల్‌కతాలలో పర్యటించి ఉద్యోగ సంఘాలతో సమావేశం కానుంది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2026 జనవరిలో కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్) 2 శాతం పెంచి, మొత్తం రేటును 60 శాతానికి చేర్చింది. తదుపరి డీఏ పెంపు ఈ ఏడాది మే, జూన్ నెలల ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ గణాంకాలపై ఆధారపడి ఉంటుంది.

## పిల్లల భవిష్యత్తుతో జూదం ఆడొద్దు

నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు నాగ్‌పూర్‌కు చెందిన ఓ విద్యార్థికి పొరపాటున అబుదాబిలోని పరీక్ష కేంద్రం కేటాయించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ సర్కార్?పై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలోని విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం జూదం ఆడటం మానుకోవాలి అంటూ ఆయన మండిపడ్డారు. ఈ ఘటన విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడికి నిదర్శనమని పేర్కొన్న రాహుల్, విద్యా వ్యవస్థ మరింత సున్నితంగా, బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'నాగ్‌పూర్‌కు చెందిన విద్యార్థి నెలరోజులుగా నీట్ రీ-ఎగ్జామ్ కోసం సిద్ధమవుతున్నాడు. పరీక్షకు ఒక్కరోజు ముందు అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్ష కేంద్రం అబుదాబి ఉంది. ఆ విద్యార్థికి పాస్‌పోర్ట్ లేదు. కుటుంబానికి విదేశాలకు పంపే ఆర్థిక స్తోమత లేదు. అంత తక్కువ సమయంలో ప్రయాణ ఏర్పాట్లు కూడా అసాధ్యం. దీంతో అతడు రాత్రంతా ఏడుస్తూ గడిపాడు. పరీక్ష రాయనని కూడా చెప్పాడు. ఆ పరిస్థితిలో అభ్యర్థి ఎంత మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నాడో ఊహించగలమా?” అని రాహుల్ ప్రశ్నించారు.

**'అలాంటి వ్యవస్థకు పరీక్షలు నిర్వహించే హక్కు లేదు'**

ఒక విద్యార్థి తన సొంత నగరంలో కూడా పరీక్ష కేంద్రం పొందలేని పరిస్థితి ఎలా వచ్చిందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అసలు ఇలాంటి పొరపాటు ఎలా జరిగిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ విద్యార్థి కూడా పరీక్ష కేంద్రానికి చేరుకోలేని పరిస్థితిని ఎదుర్కోకూడదని అన్నారు. కానీ వాస్తవానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహనాన్ని ఎన్?టీఏ పరీక్షిస్తోందని ఆయన విమర్శించారు. ఒక విద్యార్థికి స్వస్థలంలో కేంద్రం కేటాయించలేని వ్యవస్థ, విదేశీ కేంద్రాన్ని కేటాయించే స్థాయికి చేరితే అలాంటి వ్యవస్థకు పరీక్షలు నిర్వహించే హక్కు లేదని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని తాను ఇటీవల రాజస్థాన్‌లోని కోటాలో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో కూడా చెప్పానని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశంలో అమలవుతున్నది విద్యా వ్యవస్థ కాదని, ఒక తరం యువత డబ్బు, సమయం, మానసిక ప్రశాంతతను దోచుకునే వ్యవస్థగా మారిందని ఆరోపించారు. నాగ్‌పూర్‌కు చెందిన అభ్యర్థికి పరీక్ష కేంద్రం అబుదాబిని కేటాయించింది. దీనిపై ఆ అభ్యర్థి ఎన్‌టీఏ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సదరు అభ్యర్థికి నాగ్‌పూర్‌లోనే ఓ పరీక్షా కేంద్రాన్ని కేటాయించనున్నట్లు తెలిపింది.

**దేశవ్యాప్తంగా పరీక్ష కేంద్రాల్లో మాక్ డ్రిల్**

మరోవైపు నీట్ రీ-ఎగ్జామ్ సందర్భంగా శనివారం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్?ను నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో సన్నద్ధతను పరిశీలించడంతోపాటు వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం కోసం ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటల వరకు ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు, పారామిలిటరీ దళాలతో సహా 2.5 లక్షలకు పైగా భద్రతా సిబ్బందిని 5,000కు పైగా పరీక్ష కేంద్రాల వద్ద మోహరించారు. ఇదిలా ఉండగా ఎన్‌టీ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నీట్-యూజీ 2026 రీ- ఎగ్జామ్ ఆదివారం దేశవ్యాప్తంగా 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 22.79 లక్షలకుపైగా మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు అంచనా. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో జరగనుంది. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 1.30 గంటల తర్వాత ప్రవేశానికి అనుమతి ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఈ పరీక్ష సజావుగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు విస్తృతమైన భద్రతతోపాటు పరిపాలనాపరమైన చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## భారత్ ధర్మసత్రం కాదు

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. “ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం” అని ఆయన పేర్కొన్నారు.

## ఎల్‌పీజీ కోసం భారత్ కొత్త దారులు..




పశ్చిమాసియాలో ఇటీవల చెలరేగిన సంక్షోభం, భారతదేశ ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) దిగుమతి స్వరూపాన్నే మార్చేసింది. సంప్రదాయంగా గల్ఫ్ దేశాలపైనే 90 శాతం ఆధారపడిన భారత్, సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అమెరికా, ఇరాన్ సహా ఇతర దేశాల నుంచి దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. ఈ వ్యూహాత్మక మార్పు సరఫరా భద్రతకు హామీ ఇచ్చినప్పటికీ, దేశీయంగా వినియోగం తగ్గడంతో పాటు ప్రభుత్వ రంగ చమురు సంస్థలపై భారీ ఆర్థిక భారం పడిందని క్రిసిల్ నివేదిక వెల్లడించింది. సంక్షోభం కారణంగా ఫిబ్రవరిలో కేవలం 8 శాతంగా ఉన్న అమెరికా నుంచి దిగుమతుల వాటా, ఏప్రిల్ నాటికి భారతదేశ మొత్తం ఎల్‌పీజీ దిగుమతుల్లో మూడో వంతుకు (దాదాపు 33శాతం) చేరింది. 2025 చివర్లో భారత్, అమెరికా మధ్య కుదిరిన 2.2 మిలియన్ టన్నుల వార్షిక సరఫరా ఒప్పందం ఇందుకు దోహదపడింది. ఈ ఒప్పందం మన దేశ వార్షిక దిగుమతి అవసరాల్లో 10 శాతాన్ని తీరుస్తుంది. చాలా కాలం తర్వాత ఇరాన్ నుంచి కూడా దిగుమతులు మొదలయ్యాయి. ఏప్రిల్‌లో ఇరాన్ వాటా 6 శాతంగా నమోదైంది. వీటితో పాటు అర్జెంటీనా, చిలీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి కూడా భారత్ ఎల్‌పీజీ కార్గోలను కొనుగోలు చేసింది. దిగుమతుల వైవిధ్యంతో సరఫరా భద్రత లభించినప్పటికీ, దీనికి దేశం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. సుదూర ప్రాంతాల నుంచి దిగుమతుల కారణంగా రవాణా ఖర్చులు పెరిగాయి. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగా వినియోగంపై తీవ్ర ప్రభావం పడింది. ఫిబ్రవరిలో 3.2 మిలియన్ టన్నులుగా ఉన్న ఎల్‌పీజీ వినియోగం, ఏప్రిల్‌కు 2.47 మిలియన్ టన్నులకు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో వినియోగం 13 శాతం చొప్పున తగ్గగా, మే నెలలో ఏకంగా 20శాతం క్షీణించింది. ధరల పెరుగుదల ప్రభావం వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులపై అత్యధికంగా పడింది. మార్కెట్ ఆధారిత ధరలు ఉండటంతో వారు వాడకాన్ని తగ్గించుకున్నారు. అయితే, గృహ వినియోగదారులకు ప్రభుత్వం పరిమితంగానే ధరలు పెంచడంతో వారి నుంచి డిమాండ్ నిలకడగానే ఉంది. సంక్షోభం కారణంగా భారత దిగుమతులకు ప్రామాణికమైన సౌదీ అరామ్కో కాంట్రాక్ట్ ధర ఫిబ్రవరి, జూన్ మధ్య 46 శాతం పెరిగింది. కానీ, దేశీయంగా ఢిల్లీలో 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధర సుమారు 10 శాతం పెరగగా, 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా 79 శాతం పైగా పెరిగింది. గృహ వినియోగదారులకు ఊరట కల్పించేందుకు ధరలను నియంత్రించడంతో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భారీ నష్టాలను చవిచూశాయి. క్రిసిల్ అంచనా ప్రకారం మే నెలలో ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌పై ప్రభుత్వ చమురు సంస్థలు రూ. 651 నష్టపోయాయి. ఈ లెక్కన మార్చి-మే మధ్య కాలంలో ఈ సంస్థలు భరించిన మొత్తం నష్టం సుమారు రూ. 22,000 కోట్లుగా ఉంది.

# కాంగ్రెస్ నాయకులను ఎక్కడికి అక్కడ నిలతీయండి



ఆత్మ స్థైర్యంతో ఉండండి.. 2 సంవత్సరాల తర్వాత మేము మీకు అండగా ఉంటాము అప్పటిదాకా కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటాము పోరాడుతూనే ఉంటాము ఆదిలాబాద్ లో జొన్న పంట కొనుగోలు చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న పాండురంగ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్ పాండురంగ కుటుంబానికి మూడు లక్షల ఆర్థిక సాయం అందజేత పాండురంగ కుటుంబానికి 25 లక్షల తక్షణ ఎక్స్రేషియా ప్రభుత్వం ప్రకటించాలిపాండురంగ పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి తాను పండించిన జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా, సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పాండురంగ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతన్న పాండురంగ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 3,720 వస్తుందని ఆశించి నెల రోజుల పాటు మార్కెట్ యార్డ్‌లోనే జొన్నల కుప్ప వద్ద ఆయన పడిగాపులు కాశారని, కానీ ఆఖరికి క్వింటాల్‌కు రూ. 50 లంచం అడిగే దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయి ఆఖరికి తన పంట కుప్పపైనే పాండురంగ విషం తాగి చనిపోవడం రాష్ట్ర వ్యవసాయ దుస్థితికి అద్దం పడుతోందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ. 500 బోనస్ ఇవ్వకపోగా, ప్రైవేటు మార్కెట్లో రూ. 2,000 కే అమ్ముకునే దయనీయ పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. పాండురంగ కుటుంబానికి ఉన్న రూ. లక్షన్నర రుణంలో ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదని ఆయన భార్య కన్నీరుమున్నీరుగా విలపించారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం మూడు సార్లు రైతుబంధును ఎగ్గొట్టిందని, కనీసం రైతు బీమా ప్రీమియం కూడా కట్టకపోవడం వల్ల దాదాపు 7 వేల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాండురంగ బాధిత కుటుంబానికి అండగా నిలబడాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందజేశామని తెలిపిన కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా (నష్టపరిహారం) చెల్లించి తీరాలని డిమాండ్ చేశారు. అలాగే చదువుకుంటున్న ఆయన ముగ్గురు పిల్లల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని, వారికి ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు.రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకుని తమ కుటుంబాలను అనాథలను చేయవద్దని, ధైర్యంగా పోరాడాలని కేటీఆర్ రాష్ట్ర రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం పంటలు కొనకపోతే నాయకుల కాళ్లు పట్టుకోవద్దని, వాళ్ళ కాలర్ పట్టుకుని నిలదీయాలని, రోడ్డెక్కకుండా కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు కూర్చొని తమ హక్కుల కోసం ప్రశ్నించాలని సూచించారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రెండేళ్లలో మళ్ళీ కేసీఆర్ గారు వస్తారని ఆయన భరోసా ఇచ్చారు. వ్యవసాయ వ్యతిరేక విధానాలతో రైతుల ఉసురు తీసుకుంటున్న ఈ మరణాలు ఆత్మహత్యలు కావని, ఇవి ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయించిన ప్రభుత్వ హత్యలేనని కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు జాన్సన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా విస్తరించని నైరుతి రుతుపవనాలు



మృగశిర కార్తె చివరి దశకు చేరుకుంటున్నప్పటికీ వానలు ముసురుకోవడం లేదు. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలన్నీ అడియాశలైపోతున్నాయి. వానలు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. నైరుతి రుతుపవనాలు విస్తరించకపోవడం, ఆశించినంత వర్షాలు కురవకపోవడంతో వాతావరణ పరిస్థితులు కఠినంగా మారుతున్నాయి. జూన్? 19 నాటికి 28 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఈ నెల 8న నైరుతి రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకినా, పది రోజులుగా ఆశించినంత ముందుకు కదలడం లేదు. జులై మినహా వర్షాకాలంలో మెరుగైన పరిస్థితులు కష్టమేనని నిపుణులు చెబుతున్నారు. అప్పుడు అలా – ఇప్పుడు ఇలా : రాష్ట్రంలో తీవ్రమైన లోటు వర్షపాతం కొనసాగుతోంది. సాధారణంగా వానలు ఆలస్యమైనా, జూన్? రెండో వారం ముగిసేసరికి పరిస్థితి సాధారణ స్థాయికి చేరుకుంటుంది. 2015, 2021ల్లోనూ నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించినప్పటికీ వానలు ఆలస్యమయ్యాయి. ఈ సంవత్సరం 25 జిల్లాల్లో లోటు వర్షపాతంతో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్ 19 వరకు సాధారణ వర్షపాతం 76.3 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, 54.6 మి.మీ. మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 11 జిల్లాలో తీవ్రమైన లోటు ఉంది. అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 74 శాతం లోటు ఉంది. ఈ జిల్లాలో 19 వరకు 91.5 మి.మీ. వర్షం కురవాలి కానీ, 23.6 మి.మీ. మాత్రమే కురిసింది. అలాగే వరంగల్ (70 శాతం), హనుమకొండ (70), సిద్దిపేట (64), నిర్మల్ (63), ఆదిలాబాద్ (63), యాదాద్రి భువనగిరి (62), నిజామాబాద్ (56), మహబూబాబాద్? (55), జగిత్యాల (55), మంచిర్యాల (50) జిల్లాల్లో తీవ్రమైన లోటు ఉంది. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి.

**జులైలో మాత్రమే ఆశాజనకం**

వానాకాలంలో 20 శాతం లోటు తప్పదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సగటున జూన్?లో 130.3 మి.మీ, జులైలో 227.4, ఆగస్టులో 215.8, సెప్టెంబర్‌లో 167.1 మి.మీ. వర్షం కురవాలి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ దఫా వర్షాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణలో జులైలో వానలు కొంతవరకు బాగానే ఉంటాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లలో మాత్రం లోటు ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల్లో 30 శాతం లోటు నమోదు కావచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు**

మరోవైపు అసాధారణంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో వేడి, ఉక్కపోతల వల్ల శుక్రవారం జనం అల్లాడిపోయారు. రాష్ట్రమంతటా సాధారణంగా నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు 6 నుంచి 7 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండంలో 34.9 డిగ్రీల సెల్సియస్? నమోదు కావాలి కానీ 7 డిగ్రీలు పెరిగి 41.9 డిగ్రీలు నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో 7 డిగ్రీలు పెరిగి 41.3, మెదక్?లో 6.6 డిగ్రీలు పెరిగి 40, హనుమకొండలో 6.6 డిగ్రీలు పెరిగి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని మరో 116 మండలాల్లో వడగాలులు వీచాయి. అత్యధికంగా మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో 10 మండలాలు, పెద్దపల్లిలో 9, హైదరాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 8 మండలాల్లో వీచాయి. మహబూబ్‌నగర్‌లో సాధారణం కంటే 5.3, ఖమ్మంలో 4.5, హైదరాబాద్‌లో 4.2 డిగ్రీల అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# రియల్ ఎస్టేట్‌లో అవినీతి సొమ్ముతో కొంటున్న ఆనకొండలు

**హైదరాబాద్ :** దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్, ముఖ్యంగా లగ్జరీ హౌసింగ్ విభాగం ప్రస్తుతం విస్మయపరిచే స్థాయి ధరలతో దూసుకుపోతోంది. గచ్చిబౌలి, మాధాపూర్, కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో రూ. 10 కోట్ల నుండి రూ. 50 కోట్ల విలువైన విల్లాలు, సూపర్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే, ఈ అసాధారణ వృద్ధి వెనుక అసలు కొనుగోలుదారులు ఎవరు? అంత మొత్తం ఎక్కడి నుండి వస్తోంది? అనే అంశంపై ఆర్థిక, రాజకీయ వర్గాల్లో ఒక లోతైన చర్చ నడుస్తోంది. ఈ మార్కెట్‌ను నడిపిస్తున్నది కేవలం ప్రవాస భారతీయులు , నిజాయితీ గల వ్యాపారవేత్తలు మాత్రమే కాదని.. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి సొమ్ము నిక్షిప్తమై ఉందని ఇటీవల ఏసీబీ దాడుల్లో దొరుకుతున్న ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నాయి.పక్కా బిజినెస్ మైండ్ ఉన్న ఏ నిజమైన వ్యాపారవేత్త కూడా యాభై కోట్ల రూపాయల భారీ నగదును తెచ్చి ఒకే ఒక లగ్జరీ ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌పై గుడ్డిగా పెట్టుబడి పెట్టడు. ఎందుకంటే, అంత పెద్ద మొత్తాన్ని తమ సొంత వ్యాపారాల్లోనో, స్టార్టప్‌లలోనో లేదా గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలోనో మళ్లిస్తే వచ్చే రాబడి చాలా రెట్లు



ఎక్కువగా ఉంటుంది. వ్యాపారులు తమ నివాసం కోసం ఒక సారే లగ్జరీ ఇల్లు కొంటారు కానీ.. కేవలం నెలకు కొన్ని లక్షల రూపాయల అద్దె కోసం రూ. 20 కోట్ల నుండి రూ. 50 కోట్లు బ్లాక్ చేయరు. లగ్జరీ నివాస రంగంలో వార్షిక అద్దె రాబడి కేవలం 2 నుండి 3 శాతానికి మించి ఉండదు. ఇంత తక్కువ రాబడికి ఆశపడి ఏ అచ్చమైన వ్యాపారీ కోట్ల కొద్దీ సత్సంపాదనను ఇక్కడ స్తంభింపజేయడు.హైదరాబాద్ లగ్జరీ రియల్ మార్కెట్‌లో ఊహాజనితంగా పెరుగుతున్న ధరలకు ప్రధాన కారణం అవినీతి సొమ్ము , లెక్కల్లోకి రాని బ్లాక్ మనీ . పన్నుల పరిధిలోకి రాని నల్లధనాన్ని, అవినీతి ద్వారా ఆర్జించిన సొమ్మును సురక్షితంగా దాచుకోవడానికి బడా బాబులు, కొందరు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక సేఫ్ హెవెన్ లా వాడుకుంటున్నారు. బినామీల పేరిట, వివిధ అక్రమ మార్గాల ద్వారా ఈ నిధులు లగ్జరీ ప్రాజెక్టుల్లోకి ప్రవహిస్తున్నాయి. ఈ తరహా కృత్రిమ డిమాండ్ ల్లే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ అవినీతి సొమ్ము ప్రవాహం గనుక ఆగిపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా స్థిరపడి పూర్తిగా క్లీన్ అయ్యే అవకాశం ఉంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ ఐటీ కారిడార్ చుట్టుపక్కల రూ. 10 కోట్లకు పైబడి జరుగుతున్న ప్రతి లగ్జరీ రియల్ ఎస్టేట్ లావాదేవీని, కొనుగోలుదారుల పూర్తి వివరాలను దర్యాప్తు సంస్థలు సేకరించి క్రాస్-వెరిఫై చేయాలి. సదరు కొనుగోలుదారుల అధికారిక వార్షిక ఆదాయం ఎంత? వారు చెల్లిస్తున్న పన్నులకు, కొనుగోలు చేసిన ఆస్తి విలువకు పొంతన ఉందా? లేదా? అని క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తే అసలు నిజాలు, బినామీల గుట్టు రట్టవుతాయి. పారదర్శకమైన ఇటువంటి ఆడిటింగ్ వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే, హైదరాబాద్ రియల్ రంగానికి పట్టిన అవినీతి చీడ వదిలి.. మార్కెట్ నిజమైన కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తుంది

## హైదరాబాద్ వాసుల కోసం క్యూర్ 1 యాప్

-మొదటిపేజీ తరువాయి

తీసుకొచ్చింది. ఉమ్మడి ఏకీకృత బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ మార్గదర్శకాలని ప్రభుత్వం ప్రకటించింది. మూడు కార్పొరేషన్ల పరిధిలోని అన్ని విభాగాలు 90 రోజుల్లో క్యూర్ వన్ యాప్ అమలుచేయాలని పట్టణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది. యాప్ నిర్వహణ బాధ్యతను సీజీజీ, మీసేవలకు అప్పగించిన ప్రభుత్వం సమన్వయం కోసం ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేసింది.

**బిల్లులు చెల్లించేందుకు క్యూర్-1 యాప్**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వివిధ బిల్లులు ఒకే డిజిటల్ వేదికగా చెల్లించేందుకు ప్రత్యేక యాప్ సిద్ధమైంది. క్యూర్ 1 యాప్ పేరిట రూపొందించిన ఉమ్మడి ఏకీకృత బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ మార్గదర్శకాలపై మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలు మరింత సులువుగా బిల్లులు చెల్లించేందుకు క్యూర్-1 యాప్ తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నగరంలోని మూడుకార్పొరేషన్ల పరిధిలో**

వినియోగదారుల ఫోన్ నంబర్లు సేకరించి వివిధ సేవలపై వాట్సప్, ఎస్ఎంఎస్ ద్వారా సందేశాలు పంపించేందుకు ఉపయోగపడుతుందని తెలిపింది. మూడుకార్పొరేషన్ల పరిధిలోని ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్, సెల్ఫ్ అసెస్‌మెంట్, సూపర్ స్ట్రక్చర్ ఫీజు, వేకెంట్ ల్యాండ్ టాక్స్ యాప్ ద్వారా అందుబాటులో ఉంటుందని వివరించింది. జలమండలికి మంచినీరు, సివరేజి ఛార్జీలు, ఎస్పీడీసీఎల్ విద్యుత్ బిల్లులు మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ చలాన్లు చెల్లించవచ్చని తెలిపింది. ఎప్పటికప్పుడు సేవలను పెంచనున్నట్లు ప్రభుత్వం తెలిపింది

**నోడల్‌శాఖగా మీసేవ విభాగం**

క్యూర్-1 యాప్ తయారీ నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సీజీజీ, మీసేవ విభాగాలకు అప్పగించారు. నోడల్‌శాఖగా మీసేవ విభాగం వ్యవహరిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీ ప్రొటోకాల్స్ డేటా ప్రైవసీ, భద్రత పాటించాలని స్పష్టం చేసింది. యాప్‌నకి సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించేందుకు అన్నిశాఖలు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం తెలిపింది. క్యూర్ పరిధిలోని అన్ని శాఖలు 90 రోజుల్లో యాప్‌ను వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**సమన్వయం కోసం ఉన్నతాధికారుల కమిటీ**

యాప్ నిర్వహణ వివిధ విభాగాల సమన్వయం కోసం ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్‌పర్సన్‌గా మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక సీఎస్? కన్వీనర్‌గా మీసేవ డైరెక్టర్, కోకన్వీనర్‌గా ఎస్పీడీసీఎల్ సీఎండీ ఉంటారని పేర్కొంది. సభ్యులుగా జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఐటీ విభాగం అదనపు కమిషనర్లు, జలమండలి ఎండీ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్‌కమిషనర్ ఉంటారని తెలిపింది. కమిటీ నెలకు ఒకసారైనా సమావేశమై క్యూర్ వన్ యాప్ నిర్వహణ, అభివృద్ధి, సమన్వయంపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

-మొదటిపేజీ తరువాయి

తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## మెట్రో రైలు రాష్ట్రానికి అత్యంత కీలకం

-మొదటిపేజీ తరువాయి

కలిసేలా సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెట్రో రైలు రాష్ట్రానికి, హైదరాబాద్‌కు అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు అని, పెండింగ్ అంశాలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం అవసరమని లేఖలో పేర్కొన్నారు. రైల్వే మంత్రితో భేటీ సమయంలో చర్చకు అవసరమైన వివరాలు తీసుకొస్తానని తెలిపారు. ఒప్పందాలు, సంబంధిత పత్రాల కాపీలను తీసుకొస్తానన్నారు. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలపాలని కిషన్? రెడ్డిని రేవంత్ రెడ్డి కోరారు.

## ఎస్ బీఐ వర్సెస్ ప్రభుత్వం

**హైదరాబాద్ :** రాయదుర్గం భూముల విషయంలో ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ఆ భూమి తమదే అంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ తీరుపై రేవంత్ సర్కార్ తీవ్రంగా మండిపడింది. ఆ భూమిని తాము గతంలోనే కొన్నామని.. అందులో కొంత భాగం తమదేనని కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంతో ప్రభుత్వానికి ఎస్‌బీఐలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాయదుర్గం భూముల వేలం ధరతో మాత్రమే కాకుండా.. వివాదాలతోనూ ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. వేలంలో ఎకరం ధర రూ.237 కోట్లు పలికి.. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసిన ఈ భూములపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రంగంలోకి దిగింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయగా.. అది తమ భూమే అని పేర్కొంటూ.. తెలంగాణ హైకోర్టులో ఎస్‌బీఐ రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వేలం ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ).. ఇటీవల గత నెల 28వ తేదీన రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన 11.38 ఎకరాల భూమిని వేలం వేయగా.. రూ.2,529 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. అయితే అందులో 5.09 ఎకరాలు తమ భూమి ఉందంటూ ఇప్పుడు ఎస్‌బీఐ పేర్కొంటోంది. 2010లోనే ఆ భూమిని రూ.13.33 కోట్లకు తాము కొనుగోలు చేశామని ఎస్‌బీఐ వాదిస్తోంది. ఈ భూములను వేలంలో గౌరా వెంచర్స్ అనే సంస్థ ఎకరం భూమిని రూ.237 కోట్ల చొప్పున దక్కించుకుంది.ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ వైఖరిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ అయింది. రాయదుర్గం భూముల వేలంలో నిబంధనలు ఉల్లంఘించింది ఎస్‌బీఐ అని ఆరోపిస్తోంది. ఈ భూముల వేలంపై ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం తీవ్ర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఎస్‌బీఐతో రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపడి ఉన్న ఆర్థిక సంబంధాలపై పునఃసమీక్ష చేయాలలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఎస్‌బీఓలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న డిపాజిట్లు, అకౌంట్ల వివరాల సేకరణ, ప్రభుత్వ అకౌంట్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎస్‌బీఐకి భారీ షాక్ తగలనుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఎస్‌బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలం ప్రక్రియపై 3 వారాల పాటు స్టే విధిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ వివాదం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. గతంలో 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లో గల 5 ఎకరాలను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్)కు కేటాయించింది. ఆ తర్వాత ఎస్‌బీహెచ్ కాస్తా ఎస్బీఐలో విలీనమైంది.

# సంపాదకీయం

## అపహాస్యమవుతున్న హాస్యం

ప్రస్తుత డిజిటల్ యుగంలో స్టాండప్ కామెడీ సంస్కృతి యువతను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మధ్యకాలంలో హాస్యం పండించడం కంటే వివాదాలు సృష్టించడమే దీని ప్రధాన లక్షణంగా మారిందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. కామెడీ క్లబ్‌లలో లేదా సోషల్ మీడియా రీల్స్‌లో వ్యక్తమవుతున్న కొన్ని అభిప్రాయాలు, జోకులు నవ్వు తెప్పించకపోగా, వినేవారికి తీవ్ర అసహ్యం కలిగిస్తున్నాయి. హాస్యానికి , ఎగతాళికి, అవమానపర్చడానికి , అసభ్యతకు మధ్య ఉన్న లక్ష్మణ రేఖను కొందరు పూర్తిగా విస్మరిస్తుండటంతో ఈ సరిహద్దుల వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తోంది.ఇలాంటి వివాదాల్లో చిక్కుకుంటున్న వారిలో ఎక్కువ మంది ప్రొఫెషనల్ కామిక్స్ కాకపోవడం గమనార్హం. ఐటీ రంగానికి చెందిన టెకీలు, వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, ఇతర రంగాల వారు కేవలం పార్ట్-టైమ్ క్రేజ్ కోసం మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కుతున్నారు. గతంలో ఒక ప్రదర్శనలో ఐదేళ్ల చిన్నారిపై అత్యంత అసహ్యకరమైన, లైంగిక కోణంలో జోకులు వేసిన ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఇటీవల ముంబై, గురుగ్రామ్‌లలో జరిగిన 370 రూపాయల బిర్యానీ వివాదం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. మహిళల ఆత్మగౌరవాన్ని, సమ్మతిని కించపరిచేలా ప్రేక్షకులు మాట్లాడిన మాటలను సదరు కమెడియన్ అడ్డుకోకుండా ప్రోత్సహించడంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. దీనివల్ల సదరు వ్యక్తులు తమ చేతులా కెరీర్లను పాడుచేసుకోవడమే కాకుండా, ఉద్యోగాలు కోల్పోయి చట్టపరమైన ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు.రాజకీయ విమర్శల పేరుతో నేతల వ్యక్తిగత, కుటుంబ జీవితాలను కించపరిచేలా మాట్లాడటం స్టాండప్ కామెడీ కాదు.. అది ముమ్మాటికీ వ్యక్తిత్వ హననమే. రాజకీయ నాయకులను టార్గెట్ చేస్తూ కామెడీ చేయడం ఈ రంగంలో ఒక సాధారణ అంశమే అయినప్పటికీ, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులపై కొందరు కమెడియన్లు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హైదరాబాద్‌కు చెందిన కమెడియన్ అనుదీప్ కాటికాల పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ వ్యవహారాలను ఎగతాళి చేస్తూ చేసిన వ్యాఖ్యలపై జనసేన శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. ఫలితంగా ఏపీ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి మరీ అతడిని అరెస్ట్ చేయాల్సి వచ్చింది. అలాగే మరో కమెడియన్ శరత్ ఉదయ్ గతంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లను ఉద్దేశించి చేసిన పాత జోకులపై బెంగళూరులో జరుగుతున్న లైవ్ షోలో కొందరు అభిమానులు గొడవకు దిగి, బలవంతంగా క్షమాపణలు చెప్పించడం కూడా పెద్ద సంచలనంగా మారింది.రాజకీయ విమర్శలు, వ్యంగ్యం అనేది ప్రజాస్వామ్యంలో సహజం. అమెరికా, యూరప్ దేశాల్లో అధ్యక్షులపైనే తీవ్రమైన జోకులు వేస్తుంటారు. కానీ, అక్కడ ఆ వ్యంగ్యం వారి విధానాలు, నిర్ణయాలపై ఉంటుంది తప్ప వారి వ్యక్తిగత జీవితాల మీద, భార్యాపిల్లల మీద ఉండదు. మన దగ్గర జరుగుతున్న పొరపాటు ఇదే. పవన్ కల్యాణ్ గత వైవాహిక జీవితాన్ని ప్రస్తావించడం, లేదా చంద్రబాబు నాయుడిపై జరిగిన పాత హత్యాయత్న ఉదంతాలను హాస్యాస్పదం చేయడం ఏమాత్రం ప్రొఫెషనలిజం అనిపించుకోదు. కామెడీ పేరుతో సినీ సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగు స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికాల అరెస్ట్ అయ్యారు. కాకినాడ పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనుదీప్ సినిమా సెలెబ్రిటీలను కించపరుస్తూ కామెడీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నిహారిక, రామ్ చరణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఆ వీడియోలను చూసిన మెగా అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షో జరుగుతున్న చోటుకు వెళ్లారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న అనుదీప్ అక్కడినుంచి పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత మెగా కుటుంబానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశాడు. అయినా లాభం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీ ఈస్ట్ గోదావరి జాయింట్ సెక్రటరీ బడే వెంకట కృష్ణ.. కాకినాడ పోలీస్ స్టేషన్‌లో అనుదీప్‌పై ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న కాకినాడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నవ్వులు పూయించాల్సిన వేదికలు కాస్తా, రాజకీయ కక్షలకు, వ్యక్తిగత దూషణలకు సాధనాలుగా మారుతుండటంతోనే సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందిఈ పరిణామాలన్నీ స్టాండప్ కామెడీ రంగంలో సెల్ఫ్ సెన్సార్‌షిప్ ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి. కేవలం కొన్ని వ్యూస్ కోసం, చప్పట్ల కోసం , వైరల్ అవ్వాలనే తాపత్రయంతో సమాజం అంగీకరించని హద్దులను దాటడం వల్ల కెరీర్‌లు ముగిసిపోతాయి తప్ప గుర్తింపు రాదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో.. హాస్యం అంటే ఎదుటివారిని నొప్పించడం కాదు, మెప్పించడం అనే కనీస ధర్మాన్ని కమెడియన్లు తెలుసుకోకపోతే ఈ వేదికల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

# సర్కార్ నిర్లక్ష్యం.. కాలేజీల ఫీ'జులుం'



రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థుల కలలు, భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారాయి. ఫీజు బకాయిలు ఉన్నాయనే సాకుతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. దీంతో చదువు పూర్తయినవారు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు, పై చదువులకు వెళ్లలేకపోతున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు చదువు మానేయాల్సి వస్తున్నది. మరోవైపు కాలేజీలకు నిధులు రాకపోవడంతో అధ్యాపకులకు జీతాలు చెల్లించడం లేదు. ఇది విద్యా నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. రాష్ట్రంలో ఇంటర్మీడియట్, పీజీ, వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన దాదాపు 2,500కు పైగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. ఆ ప్రైవేట్ కాలేజీల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తూ వస్తున్నాయి. తెలంగాణలో దాదాపు 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి చదువుకుంటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన నిధుల చెల్లింపును పూర్తిగా నిలిపివేసింది. దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు బకాయిలు ఉన్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపింది. ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, లా వంటి కోర్సులు పేదలకు అందుబాటులో లేని సమయంలో, ఈ పథకం అండగా నిలిచింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతోమందిని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దింది. కానీ నేడు అదే పథకానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం బలిపీఠంపై పెట్టింది. పదివేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. స్కాలర్‌షిప్ నిధులను ప్రతినెలా జాప్యం చేయకుండా 'గ్రీన్ ఛానల్' వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఇంజినీరింగ్ కాలేజీల్లో పెంచిన 3035 శాతం ఫీజులను ప్రభుత్వమే భరించాలి. సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి నిధులను క్రమం తప్పకుండా విడుదల చేస్తామని, బకాయిలను వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయి. ఇక నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ట్రస్ట్, సీఎస్ఆర్ నిధులతో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి ప్రత్యేక కమిటీని నియమించింది. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినా ఇప్పటికీ నివేదికపై ఎలాంటి స్పష్టత లేదు. ప్రభుత్వ బకాయిల కారణంగా ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులపై ఫీజుల భారం మోపుతున్నాయి. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు స్పష్టం చేయడంతో విద్యార్థులు పీజీ అడ్మిషన్లు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను రూపొందించింది. అందుకోసం జీవో 7ను విడుదల చేసింది. 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి కాలేజీల ట్యూషన్ ఫీజులను విద్యార్థులకే చెల్లిస్తామని ఆ జీవోలో పేర్కొన్నది. విద్యార్థులకు చెల్లించిన తర్వాతే కాలేజీ యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయాలని షరతు విధించింది. కానీ ఎప్పుడు చెల్లిస్తారో కచ్చితమైన టైమ్‌లైన్ మాత్రం అందులో పేర్కొనలేదు. రాష్ట్రంలో ట్యూషన్ ఫీజుల కోసం ఏటా 12 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరందరికి ప్రభుత్వం రూ.2,400 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు గతంలో ఆధార్ ధ్రువీకరణ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేది. కొత్త విధానం ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు 20 శాతం మంది ఆధార్‌లో పేరు సవరించుకోవాల్సిన అవసరం ఉన్నది. చిన్న తప్పులను అడ్డుపెట్టుకొని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దూరం చేయడం దారుణం. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. కానీ ప్రభుత్వం ఫీజుల స్కీమ్‌పై గందరగోళానికి గురిచేస్తున్నది. మరోవైపు ప్రభుత్వ బకాయిల కారణంగా కాలేజీలు విద్యార్థులపై జులుం ప్రదర్శిస్తున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు కాలేజీల నడుమ పేద విద్యార్థులు నలిగిపోతున్నారు.

# ఎట్టకేలకు శాంతి దిశగా...

అమెరికా--ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారు దిశగా తొలి అడుగు పడింది. ఫ్రాన్స్‌లోని ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్‌లో ఈ ఒప్పందానికి సంబంధించిన అవగాహన పత్రం (ఎంఓయూ)పై స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంతకాలు చేశారు. ఇద్దరూ పరస్పరం వేల కిలోమీటర్ల దూరంలో ఉండి ఈ తంతు ముగించడాన్నిబట్టే ఆ రెండు దేశాలమధ్యా ఉన్న వైషమ్యాల తీవ్రతేమిటో తెలుస్తుంది. మొదట ట్రంప్ సంతకం చేసి ఆన్‌లైన్‌లో పంపిన ఎంఓయూ నకలు తీసుకుని దానిపై పెజెష్కియాన్ సంతకం చేశారు. ఈ వారం ఆఖరులో జెనీవాలో ఈ సంతకాల కార్యక్రమం ఉంటుందని తొలుత ప్రకటించినా, ఎందుకనో అంతా మారింది. అనుసరించిన విధానం ఏమైనా, ఇకపై పశ్చిమాసియా ప్రశాంతంగా ఉంటే అదే పదివేలని ప్రపంచ ప్రజానీకమంతా ఆరాట పడుతున్నది. తుది ఒప్పందానికి రావటం కోసం రాగల అరవై రోజుల వ్యవధిలో అమెరికా, ఇరాన్ రెండూ ఏమేం చేయాలో ఈ 14 అంశాల ఎంఓయూలో ఉంది. ఇతరత్రా అంశాల మాటెలావున్నా హార్ముజ్ ప్రతిష్ఠంభనకు తెరపడటం, అణ్వాయుధాల జోలికిపోనని ఇరాన్ హామీ ఇవ్వటం ప్రధానమైనవి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సాగించే హత్యాకాండను ఆపటంతోసహా అన్ని రకాల యుద్ధాలూ పరిసమాప్తం చేయటం, ఇరాన్ పునర్నిర్మాణానికి అమెరికా, ఈ ప్రాంత భాగస్వామ్య దేశాలూ 30,000 కోట్ల డాలర్ల నిధిని సమకూర్చటం, ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షల తొలగింపుపై విధివిధానాలు వెల్లడించటం కూడా ఇందులో భాగమే. 30 రోజుల్లో ఇరాన్ సమీపంలోని అమెరికా నౌకలన్నీ నిష్క్రమిస్తాయనీ, యుద్ధ ప్రారంభానికి ముందున్న పరిస్థితులు పునరుద్ధరిస్తారనీ ఎంఓయూ చెబుతోంది. అయితే ఇప్పటికే 60 శాతం అభివృద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ ఏం చేయాలో ఇరు దేశాలూ చర్చించుకుంటాయి. ఇజ్రాయెల్‌తో కుమ్మక్కయి అకారణంగా, ఏకపక్షంగా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ఎటు తీసుకుపోవాలో, 'గౌరవప్రదంగా' ఎలా బయటపడాలో దిక్కుతోచని అమెరికాకు ఇప్పుడు అన్నివిధాలా గర్వభంగమైంది. చిత్రమేమంటే... ఒకే లక్ష్యంతో ఈ ఊబిలోకి దిగిన మిత్రులు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూలిద్దరికీ కొద్ది రోజుల్లోనే మార్గాలు వేరయ్యాయి. ఈ యుద్ధాన్ని తక్షణం వదుల్చుకుంటే తప్ప ఏడాది ఆఖరుకల్లా దేశంలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవటం ఖాయమని ట్రంప్‌కు అర్థమైతే... ఇది కొనసాగుతుంటే తప్ప ఏడాది చివరన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు అసాధ్యమని నెతన్యాహూ లెక్కలేసుకున్నారు. ఆయన సమస్యేమిటో ట్రంప్‌కు తెలియకపోలేదు. కానీ మిత్రత్వం కంటే స్వీయ పీఠ సంరక్షణే ప్రధానమని ఆయన గ్రహించారు.



అందుకే విధి లేని స్థితిలో ఈ ఒప్పందానికొచ్చారు. హార్ముజ్ మూతతో అమెరికాలో గ్యాసోలిన్ ధరలు మిన్నంటాయి. ద్రవ్యోల్బణం హద్దులు దాటింది. సరుకుల కొరత ఏర్పడింది. ఒబామా హయంలో ఇంతకంటే మెరుగ్గా కుదిరిన ఒప్పందాన్ని బుట్టదాఖలు చేసిన ట్రంప్, దీనికెలా అంగీకరించారన్న కథనం ఆసక్తికరమైనది. దౌత్యంలో దేశాల అధినేతలు అవతలి పక్ష సైనిక, ఆర్థిక, భౌగోళిక రాజకీయ స్థితిగతుల్ని విశ్లేషించగల నిపుణుల సాయం తీసుకుంటారని చెబుతారు. కానీ ఇరాన్ మరో అడుగు ముందుకేసి మానసిక ఆరోగ్య నిపుణుల్ని కూడా ఇందులో చేర్చిందంటున్నారు. ట్రంప్ ప్రకటనల్ని, క్షణక్షణానికి మారే ఆయన వైఖరుల్ని గమనిస్తూ ఎలా మాట్లాడితే బోధపరుచుకుని సానుకూలంగా స్పందిస్తాడో వారు సలహాలిచ్చారని దాని సారాంశం. ట్రంప్ తీరుతెన్నులు గమనిస్తే అది నిజమే అనిపిస్తుంది. తన కనుసన్నల్లో ఖరారైన ఎంఓయూ తనకి నచ్చకుంటే మళ్లీ బాంబులేయటానికి వెనకాడనని ఆయనే చెప్పటాన్ని గమనిస్తే ట్రంప్‌ను ఇరాన్ సరిగానే అంచనా వేసిందనుకోవాలి. పారిస్ వెలుపలనున్న ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్ రాచరిక ఉత్థాన పతనాలు చూసింది. ఫ్రెంచ్ విప్లవాన్నీ, దానిలోని ప్రజాస్వామిక ఆకాంక్షలనూ గమనించింది. 1783లో బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్‌ల సరిహద్దు తగాదాలపై ఒడంబడికకు సాక్షిగా నిలిచింది. జర్మనీని అవమానకరమైన ఒప్పందంతో శాసించి, 1919లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని ముగించిందీ ఇక్కడే. కానీ అమెరికాకు ఇప్పుడెదురైన అవమానం స్వచ్ఛందం, స్వయంకృతం. ఇన్నింటికి వేదికైన చోట కుదిరిన ఈ ఎంఓయూను ట్రంప్ గౌరవిస్తారని ఆశించాలి.

# అమెరికా అమిత్ర వైఖరి

ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హార్ముజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది. కానీ దీన్ని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారని తేలాక మిన్నకుండి పోయింది. అయినా ట్రంప్‌లో ఆగ్రహావేశాలు తగ్గలేదని తాజా సమావేశం రుజువు చేసింది. మాటలకేం... ట్రంప్ చాలా మాట్లాడారు. 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశం అనంతరం 'మోదీ మంచిగా కనబడతారు. బాగుంటారు. దేవదూత. కానీ 'కిల్లర్'. వాణిజ్య, వ్యాపార చర్చల్లో చాలా కఠినంగా, నిక్కచ్చిగా ఉంటారు' అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ఎవరైనా భారత్‌వైపు కన్నెత్తి చూస్తే వాళ్ల అంతు చూస్తామని కూడా చెప్పారు. వాణిజ్య ఒప్పందం విషయంలో చాలా దగ్గరగా వచ్చేశామని కూడా అన్నారు. కానీ చేతలు చూస్తే అందుకు అనుగుణంగా లేవు. తన ఆధ్వర్యంలోని కమాండ్లలో ఒకటైన ఇండో-- పసిఫిక్ కమాండ్‌కు ఆ పేరు పెట్టింది ఆయన ఏలుబడిలోని అమెరికాయే. తిరిగి ఆయనే ఎనిమిదేళ్లనాటి ఆ పేరులో భారత్‌నుసూచించే 'ఇండో' తొలగించి ఇప్పుడు యూఎస్-- పసిఫిక్ కమాండ్‌గా మార్చటం, అది కూడా ఈ సమావేశానికి కొంచెం ముందుగా చేయటం యాదృచ్ఛికమేమీ కాదు. ఇటీవల యూఎస్--పసిఫిక్ కమాండ్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను పాకిస్తాన్‌లో అంతర్భాగంగా చూపటంలోనూ అమెరికా దురుద్దేశం స్పష్టమే. పాకిస్తాన్ పాలకులతో ట్రంప్‌కి ఏర్పడిన కొత్త చుట్టరికం అందరికీ తెలుసు. తూర్పు, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాల్లో చైనా దూకుడునూ, ఆధిపత్య ధోరణుల్నీ ఎదుర్కొనటానికి ఆ దేశంతో సమస్యలున్న భారత్‌ను కలుపుకోవాలని నిర్ణయించి 2007లో క్వాడ్‌కు అంకురార్పణ చేసింది అమెరికాయే. హిందూ మహా సముద్రప్రాంతంలో చైనా విస్తరణవాద వైఖరిని ఎదుర్కొనటానికి క్వాడ్, దాంతోపాటు ఇండో-- పసిఫిక్ కమాండ్ తోడ్పడతాయని కూడా అప్పట్లో తెలిపింది. కానీ స్వప్రయోజనాలే తప్ప మరేమీ పట్టని అమెరికాను నమ్ముకుని ముందడుగు వేయొద్దని అనేకమంది నిపుణులు అప్పట్లోనే మన దేశాన్ని హెచ్చరించారు. ఇవాళ చైనాతో అంటకాగటానికి రెడీ అయి, ఆ కమాండ్ పేరే మార్చిన అమెరికా కీలక సమయాల్లో ఎలా ఉండగలదో సులభంగానే ఊహించుకోవచ్చు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కిన వెంటనే అందరికన్నా ముందు ఆయనతో వాణిజ్య ఒప్పందంపై చర్చించింది మనమే అయినా... మన తర్వాత వచ్చిన దేశాలు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మనం కూడా బ్రిటన్, యూరోపియన్ యూని యన్ (ఈయూ), కెనడాలతో వాణిజ్య ఒప్పందాలు ఖరారు చేసుకోగలిగాం. వీటిపై లాంఛనంగా సంతకాలు చేయటమే మిగిలివుంది. మనకి నచ్చని అంశాలున్నప్పుడూ, అన్యాయమైన షరతులు పెడుతున్నప్పుడూ వ్యతిరేకించటం, కొంత జాప్యం జరిగినా ఈ విషయంలో మన ప్రయోజనాల పరిరక్షణకే ప్రాముఖ్యతనివ్వటం సరైన వైఖరి. ఉత్త మాటలతో ఎవరినీ నమ్మించలేమని ట్రంప్ గ్రహించేలా చేయటం అవసరం.

# వడ్డేపల్లి రామచందర్ జన్మదినం సందర్భంగా తబిత ఆశ్రమంలో అన్నదానం

**రామగుండం మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సేవా కార్యక్రమం**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రామగుండం మండలంలోని స్థానిక తబిత ఆశ్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి సూచన మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరిపి, అనంతరం వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజ సేవే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలు, అనాథలకు అండగా నిలవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని, వారి ఆశీర్వాదాలు మరింత సేవా కార్యక్రమాలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

వడ్డేపల్లి రామచందర్ ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు నిరంతరం సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ




కార్యక్రమంలో రామగుండం మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, జక్కన్న బాలు, జక్కుల పద్మ, బూడిద హర్ష, చిలువేరు కుమార్, హనుమాన్ల వెంకటేష్, కుమార్, ఏరుకొండ తిరుపతి, సింగారం శ్రీకాంత్, ఓబీసీ మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రారంభమైన మొహరం ఉత్సవాలు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి,నియోజక వర్గంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం ఉత్సవాలు కల్వకుర్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. పీర్ల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్ల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కుల, మత భేదాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొని సామరస్య భావాన్ని చాటుతున్నారు. మొహరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే మొరం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం ప్రకారం భక్తులు తమ కోరికలు నెరవేరాలని పీర్ల వద్ద అగరబత్తులు, కొబ్బరికాయలు సమర్పించి ప్రార్థనలు చేస్తారు. కోరికలు తీరిన అనంతరం మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పీర్లను దర్శించుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం, తెలంగాణలో పీర్ల పండుగకు శతాబ్దాల చరిత్ర ఉంది.



ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ ప్రాంతంలోని ప్రసిద్ధ పీర్ల ఉత్సవాల నుంచి ఈ సంప్రదాయం అనేక గ్రామాలకు విస్తరించిందని చెబుతున్నారు. నేటికీ వేలాది మంది భక్తులు అక్కడికి చేరుకుని తమ మొక్కులు చెల్లిస్తూ ఆశీర్వాదాలు పొందుతున్నారు. గ్రామాల్లో వ్యాధులు, కష్టాలు దూరం కావాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలకు సుఖశాంతులు కలగాలని పెద్దలు మొరలు పెట్టుకునే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. భక్తి, విశ్వాసం, మత సామరస్యం కలగలిసిన ఈ మొహరం ఉత్సవాలు కల్వకుర్తి ప్రాంతంలో ఘనంగా జరుపుకుంటున్నారు.

## ఉన్నతి శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేత




పాల్గొన్న ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి

తలకొండపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరివచిన విద్యార్థిని, విద్యార్థులకు ఉన్నతి శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి సన్మానం చేసి , నగదు బహుమతి ప్రోత్సహకంగా అందించారు. చైర్మన్ మాట్లాడుతు, ప్రభుత్వ విద్యాలయాలు బలోపేతం చేస్తే, పేద విద్యార్థులకు ఉపయోగ పడటమే కాకుండా, మట్టిలో మాణిక్యాలు తీసినట్లు అవుతుంది అన్నారు. అందుకు ఉదాహరణ గా ఈ మధ్యకాలంలో వెలువడిన 10వ తరగతి ఫలితాలలో గట్టుప్పలపల్లి, తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐఐఐటి బాసరలో సీట్లు సాధించడం మనందరికి గర్వకారణం అని కొనియాడారు. ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి మా ఫౌండేషన్ నుండి సహాయ, సహకారాలు ఉంటాయని తెలియజేశారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తెచ్చి సమాజానికి తొడపడాలని తెలిపారు, ఫౌండషన్ సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఎంపీడీఓ సీతారావమ్మా మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు పోకుండా, ఫోన్లు వాడకుండా మంచి క్రమశిక్షనతో ఎదగాలని, విద్యను మించిన శక్తీ వంతమైన ఆయుధంలేదని తెలిపారు. ఈ కార్యక్రమలో, ఎం ఈ ఓ చంప్లనాయక్, ఫౌండేషన్ సెక్రటరీ బండి రఘుపతి, స్థానిక సర్పంచ్ శేఖర్, మార్కెట్ కమిటీ డైరక్టర్ డైరెక్టర్ అంజయ్య ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ కళాశాల అకాడమిక్ ఇంచార్జి కృష్ణకాంత్ ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్, రమేష్, యాదగిరి, నితిన్, శివ మల్లేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు అధికారులు నాయకులు అనిల్ కుమార్, డేవిడ్, కృష్ణ, వెంకటయ్య, టీచర్స్ అరవిందు కుమార్, రాజశ్వర్ రెడ్డి, సాయితేజ, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి సీఐగా బాధ్యతలు స్వీకరించిన భీమ్ కుమార్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)




కల్వకుర్తి మండల సీఐ గా భీమ్ కుమార్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ నాగార్జున బదిలీ కావడంతో ఆ స్థానంలో వికారాబాద్ నుంచి బదిలీగా విచ్చేసిన భీమ్ కుమార్ ను నియమించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ భీమ్ కుమార్ మాట్లాడుతూ.శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు.అక్రమ ఇసుక రవణా పై,అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. గుట్కా, పేకాట, గంజాయి పై, ఉక్కు పాదం మోపనున్నట్లు తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు సద్వినియోగం చేసుకోవాలని సూచించిన గట్ల కేశవరెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం పడకల్, వెల్జాల్ గ్రామాల్లోని సహకార సంఘం గోదాంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని పి ఎ సి ఎస్ అధ్యక్షులు గట్ల కేశవ రెడ్డి తెలిపారు. పడకల్, వెల్జాల్ ను ఎరువుల యాప్ లో నమోదు చేసే ప్రక్రియను కేశవ రెడ్డి ప్రారంభించారు. ఎరువుల యాప్ లో బుక్ చేసుకున్న రైతులకు సహకార సంఘం ఎరువులు, 20:20:20, యూరియా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎరువులు కావలిసిన రైతులు యాప్ లో నమోదు చేసుకోవాలని గట్ల కేశవ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా బ్లాక్ అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి, ఎ ఈ ఓ త్రైలోక్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచి కుమ్మరి శంకర్, సీఈఓ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్,మాజీ సర్పంచి శంకర్ నాయక్, పి ఎ సి ఎస్ డైరెక్టర్ యాదయ్య, రైతులు జగ్గారెడ్డి, చెన్నయ్య, దాసు, అమృత లింగం, శేఖర్, రాములు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదల కుటుంబానికి చేయూత

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల బాలమణి నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక నాయకుల ద్వారా ఇంటి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా వెంటనే స్పందించి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా పూర్తి ఇంటి నిర్మాణానికి సిమెంట్ ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ అన్న కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్ వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, నాయకులు వెంకటయ్య దీప్లతదితరులు పాల్గొన్నారు

## మున్నూరు కాపు సంఘం అధ్యక్షునిగా గాదె సదయ్య



అగ్నిధార న్యూస్ కమన్పూర్

కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామ మున్నూర్ కాపు సంఘం అధ్యక్షునిగా గాదె సదయ్య (తా/రా రాయమల్లు)ను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కాపు సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గాదె సదయ్య, ఉపాధ్యక్షులు దండె కనకరత్నం, బోయిని బాలకృష్ణ, కోశాధికారిగా ఉప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజయ్య, కార్యదర్శులుగా గాదె చిన్న సదయ్య, జక్కుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా మూదాం చిన్న కొమురయ్య, సలహాదారులుగా అడువాల చంద్రయ్య, దండె లక్ష్మీనారాయణ, గౌర అధ్యక్షులుగా అర్సె కృష్ణ, అర్సె ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా ముకుంద శ్రావణ్, గడుసు మల్లేష్, దండె కాలేష్, ఆకుల తిరుపతి, గాదె నారాయణ, దండె రజినికాంత్, దండె రమేష్, నిమ్మతి రమేష్, అడ్వాల ప్రసాద్, గాదె శంకరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘమ అధ్యక్షులు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి నీ కలిసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

అగ్నిధార న్యూస్ కమన్పూర్



హైదరాబాదులో రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమలు అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దుద్దిల్ల ను కలిసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కమాన్పూర్ మత్స్య పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షులు గడప కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది అనంతరం మండల కేంద్రంలో మత్స్య శాఖ పరిశ్రమ సహకార సంఘం భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయలు మరియు మండల కేంద్రంలోని సగర సంఘం భవనం చుట్టూ ప్రహరీ గోడ భవనం ముందు షెడ్డు నిర్మాణం కోసం రూపాయలు 10 లక్షలు అలాగే మండల కేంద్రంలోని హనుమాన్ నగర్ హనుమాన్ టెంపుల్ వద్ద నుండి పెద్ద చెరువు వరకు మెటల్ రోడ్డు నిర్మాణం అలాగే పిల్లిపల్లె పెద్దమ్మ టెంపుల్ నుండి పెద్ద చెరువు వరకు మెటల్ రోడ్డు నిర్మాణం కొరకు రూపాయలు 20 లక్షలు మంజూరు చేయాల్సిందిగా శ్రీధర్ బాబుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గాండ్ల మోహన్ తో పాటు గడప కృష్ణమూర్తి మాజీ ఎంపీటీసీ ఢిల్లీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## బతికిస్తే భవిష్యత్తు ఉంది..!

**చిన్నారి విరాట్‌కు చేయూతనివ్వండి**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):



ఎనిమిదేళ్ల వయసు... జీవితాన్ని ఆస్వాదించాల్సిన వయసులో ఆసుపత్రి మంచానికే పరిమితమయ్యాడు. ఆటలు, పాఠశాల, స్నేహితులతో గడపాల్సిన రోజుల్లో ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఎన్టిపిసి పరిధిలోని మల్కాపూర్‌కు చెందిన మనాల తిరుమలేష్, స్వప్న దంపతుల కుమారుడు మనాల విరాట్ విల్సన్ వ్యాధి కారణంగా తీవ్ర కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల పరీక్షల్లో చిన్నారికి అత్యవసరంగా కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంట్) చేయాలని సూచించారు. ఈ శస్త్రచికిత్సతో పాటు వైద్య చికిత్స కోసం సుమారు రూ.25 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. అయితే సాధారణ కుటుంబానికి చెందిన విరాట్ తల్లిదండ్రులకు అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చే ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నబిడ్డను కాపాడుకోవాలనే తల్లిదండ్రుల తపన ఒకవైపు, చికిత్సకు అవసరమైన భారీ ఖర్చు మరోవైపు వారిని తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది. "మా బిడ్డకు మరో జీవితం ఇవ్వండి... మీకు తోచినంత సహాయం చేయండి. ప్రతి రూపాయి మా కుమారుడి ప్రాణాలను కాపాడే ఆశాకిరణం అవుతుంది. అలాగే మా విజ్ఞప్తిని ఎక్కువ మందికి చేరేలా పంచండి" అని వారు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చిన్నారి విరాట్‌కు చేయూతనిస్తే, అతడికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వారవుతారు. దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్‌కు పరామర్శ

**ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**

అగ్నిధార న్యూస్,( రామగుండం):



మంథని మండలంలోని దుబ్బపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్‌ను సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ గోదావరిఖనిలోని రియాజ్ అహ్మద్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా డా. మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ.. రియాజ్ అహ్మద్ ప్రమాదానికి గురైన విషయం తెలిసి బాధ కలిగిందన్నారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడటం ఉపశమనకరమని పేర్కొన్నారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో మునుపటిలాగే చురుకుగా సేవలందించాలని ఆకాంక్షించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడం, వారికి ధైర్యం చెప్పడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, సమత సైనిక్ దళ్ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రజలు పాల్గొని రియాజ్ అహ్మద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

**టాస్క్ సి ఓ ఓ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తుక్కుగూడ లోని ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ కంపెనీలో గత రెండు వారాల క్రితం ఇంటర్వ్యూ కు హాజరైన వారిలో ఉద్యోగాలు సాధించిన కల్వకుర్తి నియోజక వర్గంలోని వివిధ మండలాల 9 మంది నిరుద్యోగయువత జాయినింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వారిని అభినందించారు.

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత కష్టపడి చదివి, నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రతిష్టాత్మక సంస్థల్లో, కంపెనీలల్లో ఉద్యోగాలు పొందడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఉద్యోగం సాధించిన యువత ఇతర నిరుద్యోగులకు ఆదర్శంగా నిలవాలని, తమ వృత్తిలో రాణిస్తూ , ఆర్థికంగా బలోపేతం అవుతూ , ఉజ్వలమైన భవిష్యత్ నిర్మాణం కోసం అడుగులువేయాలని ఆకాంక్షించారు. అలాగే యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లు, ఉచిత శిక్షణా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు , అవగాహనకార్యక్రమాలు మరింత మందియువతకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ , సహకారాల కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని అర్హత ఉన్న నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత మాట్లాడుతూ మా భవిష్యత్ గురించి ఆలోచిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మాకుతోడ్పాటునందిస్తున్నందుకు ,ఇంత మంచి అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు

ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు , ఐక్యత పౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటు బడి ఫీజు దోపిడీని అరికట్టాలి

**ఎం ఈ ఓ కి వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

విద్య హక్కు చట్టాన్ని తుంగాలో తొక్కుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. పుస్తకాలు, దుస్తులు పేరిట ప్రైవేటు పాఠశాలల దందాను అరికట్టాలి. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి. పాఠశాలలు కాలం తీరిన బస్సులని బస్సులో నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం. విద్యను వ్యాపారం చేస్తున్న పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోని ఎడల కల్వకుర్తి గడ్డ నుండి ముఖ్యమంత్రి కార్యాలయం వరకు ఫీజు పోరు యాత్ర చేపడతామని దారమోని గణేష్ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ కి కలిసి వినతి పత్రాన్ని సమర్పించి అనంతరం ఫీజు పోరు యాత్రకు పిలుపునివ్వడం జరిగింది. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యని వ్యాపారంగా చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తూ పాఠశాలలోనే పుస్తకాలను, దుస్తులను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయని వీటి పైన రాష్ట్రంలో నియంత్రణ కరువైందని, వీటిపైన వెంటనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టాలని గణేష్ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యాలు కాలం తిరిగిన బస్సులను, సరైన ఫిట్నెస్ లేకున్నా విద్యార్థులను తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న రవాణా అధికారులు, ప్రతి ఒక్క బస్సులో దాని యొక్క ప్రమాణాలకు మించి విద్యార్థులను తరలిస్తూ కనీస సేఫ్టీని కూడా పాటించని బస్సులు ఇలా ఒకటి రెండు కాదు పదుల సంఖ్యలో బస్సులో ఉన్న వాటిపై చర్యలు తీసుకునే నాదురే లేరు, ఇలా ప్రతిదీ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తే అవినీతి నిరోధక శాఖ వీటిపై నిగా పెంచాలని ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ సర్కార్లో కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించలేకపోవడం సిగ్గుచేటని గురుకుల పాఠశాలలను నీరుకార్చారని ఇప్పుడు కొత్తగా 24,000 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కుదించి ప్రభుత్వ పాఠశాలలనే లేకుండా చేస్తామనడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనకు నిదర్శనమని, వెంటనే ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గణేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీరు ఇస్తామన్న మెగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని లేనియెడల ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ చెప్పారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కల్వకుర్తిలో నియోజకవర్గం లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు పాఠశాలలో అడ్డగోలుగా కార్పొరేట్ విద్యా పేరుతో, పాఠశాల గోడలకు రంగులు వేసి సరైన విద్యాహరత లేని ఉపాధ్యాయులు నియమించి తూతూ మంత్రంగా విద్యా బోధన సాగుతున్న విద్యాశాఖ అధికారులు కనీసం పాఠశాలలు తనిఖీ చేసే సోయిలో లేరని, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులను వసూలు చేస్తున్న విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని చూసి చూడనట్టు ప్రైవేటు పాఠశాలకు అండగా నిలుస్తున్న అధికారుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని. లంచాల మత్తులో క్షేత్రస్థాయి పరిశీలనను కూడా మరచిపోయి విద్యాశాఖ కళ్ళు మూసుకుపోయిందని రేవంత్ రెడ్డి సర్కారులో ఫీజు నియంత్రణ కమిటీ కనుమరుగైందని ఇకనైనా పాఠశాలల్లో తనిఖీలు చేసి పాఠశాలన్ని వ్యాపారంగా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేసి యాజమాన్యం పైన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్వి తరఫున డిమాండ్ చేస్తున్నామని గణేష్ తెలిపారు. లేనియెడల స్వయంగా ప్రతి పాఠశాలలను బిఆర్ఎస్వి తరుపున ఫీజు పోరు యాత్ర చేపడతామని దారమోని గణేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు ఐలా శేఖర్ గౌడ్, వట్టెపు శ్రీనివాసులు, పెరుమాళ్ళ కృష్ణ, యాకూబ్, రమేష్ నాయక్, నరేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల విమర్శలు అవగాహన రాహిత్యమే

**రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసింది.**
**గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి.**



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రూ.23 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక కౌన్సిలర్ నక్క సంతోషి రాములు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి అధికంగా రావడంతో సేకరణ ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. ఈ విషయాన్ని విస్మరించి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వాస్తవాలను పక్కనపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో ముందంజలో ఉందని పేర్కొన్న ఆయన, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు వైద్య సహాయం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు గృహాల మంజూరు వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని, మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తి పనులను పూర్తి చేయడంతో పాటు ప్రతి వార్డులో సీసీ రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కౌన్సిలర్లు గుంటుకు శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నరసింహారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, ఊడేం శ్రీనివాస్ రెడ్డి, సింగితం అశోక్, సయ్యద్ మతిన్, జోగిని లక్ష్మణ్,మహిపాల్ రెడ్డి, మహంకాళి చందయ్య, భాగమొల్ల చంద్రం, బడే సత్యనారాయణ, ర్యాకమ్ నర్సింలు, ముత్యాలు బడే రవి, లతీఫ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షరెడ్డి నర్సారెడ్డిని ఆహ్వానించిన రాగుల రాజు

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగదేవపూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు ముదిరాజ్ తన కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిలకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించాలని వారిని కోరారు. నాయకులు ఆహ్వానాన్ని స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ కొంపెల్లి కరుణాకర్ నాయకులు అమర రాము ఆంజనేయులు గౌడ్ కిషన్ ముదిరాజ్ సుధాకర్ ముదిరాజ్ పలువురు కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల విద్యార్థులకు పుస్తకలు అందజేసిన గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరుతూ లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతంకై ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం వహించాలని వారు కొనియాడారు. అనంతరం వేసవికాల సెలవులు ముగించుకొని 1వ తరగతి లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు అక్షర బ్యాసాన్ని నిర్వహించారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి డూప్యూటీ సర్పంచ్ బూత్కూరి వెంకట్ రెడ్డీ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు కృష్ణారెడ్డి ప్రసన్న మేడం ఆనంద్ రావు సార్ వార్డ్ సభ్యులు రాజమౌని భాగ్య మల్లేమోగ్గాలా శ్రీజ చింతలపల్లి సురేందర్ రెడ్డీ బొచ్చుపల్లి శేఖర్ అంగన్వాడీ టీచర్స్ భారతి రత్నమ్మ సాత్విక మరియు మహిళ సంఘం అధ్యక్షురాలు వసంత మరియు గ్రామ పెద్దలు గ్రామస్తులు మహిళాలు బాల బాలికలు పాల్గొనడం జరిగింది.

## అంజన్న ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు



**కుటుంబ సమేతంగా అంజన్నను దర్శించుకున్న జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ జి. రాజగౌడ్.**

**అన్నిధారన్యూస్ మల్యాల**

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ జి. రాజగౌడ్ శనివారం కుటుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి ఆశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ శాలువ కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పద్మశాలి సేవా సంఘం కృషి- సామాజిక సేవా కార్యక్రమం



**పద్మశాలిల అభివృద్ధి, సేవా కార్యక్రమలే లక్ష్యంతో పనిచేస్తున్న పద్మశాలి సేవా సంఘం**
**ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ**
**పద్మశాలి సేవ సంఘం సొంత నిధులతో సేవా కార్యక్రమాలు**
**పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ మండలం బెజగామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా 59 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ

సామాజిక సేవా కార్యక్రమం లో భాగంగా పేద విద్యార్థిని, విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయంగా స్టీల్ వాటర్ బాటిల్స్ స్టీల్ ప్లేట్లు, అందజేసినట్లు తెలిపారు. పద్మశాలి సంఘం సొంత నిధులతో

రూ:13 ,500 స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్లు, పంపిణీ ప్రతిష్టాత్మకంగా సమాజ శ్రేయస్సు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మా సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయి ఉపాధ్యాయురాలు బాలమణి ,ముఖ్య అతిథి గ్రామ సర్పంచ్ నకిర్త గోపాల్, ఉప సర్పంచ్ దుబ్బాక కరుణాకర్, హైస్కూల్ హెచ్.ఎం .పీ. రమేష్ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు శంకరయ్య జి. జ్యోతి జి. కనకరాజు, సభను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం స్టీల్ వాటర్ బాటిల్స్, ప్లేట్లు అందజేయడం అభినందనీయమని కొనియాడినారు. దీనికి సహకరించిన దాతలు బొల్లిబత్తుల దేవదాసు, తలకొక్కుల మధుసూదన్, నాగరాజు నేత, యువజన అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పాషికంటి శ్రీనివాస్, షేర్ల నర్సింలు. మహేందర్,పెండెం కృష్ణ. గారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలమణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, చెప్పాల మల్లేశం, నల్ల శివకుమార్, పద్మశాలి సంఘం కులస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి

**బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష**


**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,జూన్ 20:(కమాన్ ప్రెస్ క్లబ్ న్యూస్)**రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణమని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తూ అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కేంద్రంలో తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసరి ఉష మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తప్పుబట్టారు. ఎన్నికలకు ముందు చివరి గింజ వరకు కొంటామని, అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం,నేడు అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎంత పంటను కొంటుందో,అంతే కొంటామని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి,ఇప్పుడు కేవలం కొన్ని రకాల పంటలకు మాత్రమే పరిమితం కావడం రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు యూరియా బస్తాల కోసం రైతులు చెప్పులు పెట్టి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని,తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పంజాబ్‌ను మించే స్థాయిలో వరిని పండించిన మన రైతన్నలు, ఇప్పుడు మళ్లీ సమైక్య పాలననాటి



ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె గుర్తు చేశారు.ఆనాడు అన్ని పంటలకు బోనస్ అని చెప్పి,ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగినప్పటికీ,దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.రైతుల పొట్ట కొట్టేలా రాజకీయాలు చేయడం మానుకోవాలని, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని,లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.సమావేశంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు,చిన్నకల్వల మాజీ ఎంపీటీసీ సంపత్,ఓదెల మండల నాయకులు బీరం రవి,రాంపల్లి వార్డ్ సభ్యులు శ్రవణ్,నర్సయ్య,కనగర్తి గ్రామ వైస్ ప్రెసిడెంట్ సదయ్య,నాయకులు దోది అశోక్, మల్లేష్, మహేందర్, అబ్దుల్ మాలిక్, అవినాష్, అంజయ్య,వంశీ,శ్రీను,హరికృష్ణ,సింగసాని అనిల్, సంతోష్, చందు,సాయి చరణ్,పుల్లూరి అవినాష్,రైతు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్





**యూరియా సరఫరాలో తెలంగాణ దేశానికే ఆదర్శం.**
**యూరియా బుకింగ్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలి..**
**బోనస్ పొందాలంటే ప్రభుత్వం గుర్తించిన ఏడు వరి రకాలనే సాగు చేయాలి..**
**జిల్లాలో యూరియా కొరతకు తావులేదు..**
**యూరియా బుకింగ్ యాప్‌పై డీలర్లు, వ్యవసాయ అధికారులు, రైతులకు శిక్షణ కార్యక్రమం...**
**ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ...**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి మొబైల్ ఫెర్టిలైజర్ యూరియా బుకింగ్ యాప్ ను ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. అనంతరం యాప్ వినియోగంపై ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ...**

రైతులు యూరియా కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో పెద్దపల్లి జిల్లాలో యూరియా బుకింగ్ యాప్‌ను రబీ పంట కాలంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

గత రబీ సీజన్‌లో జిల్లాలో 4 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌ను పొందాలంటే రైతులు బీపీటీ, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, తెలంగాణ సోనా, వరంగల్-44, 1638, 7715 అనే ఏడు సన్నా వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామని, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులు, డీలర్లను ఆదేశించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. జూన్ 30 నుంచి రైతు భరోసా ఖరీఫ్ నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేష పురోగతి సాధించామని, గత రెండున్నర సంవత్సరాల్లో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేసి రాష్ట్రస్థాయి గుర్తింపు పొందినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, అధికారులు ఎరువుల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీవోకి ఓకే..

**న్యూఢిల్లీ:** దేశీయంగా అతి పెద్ద ఫండ్ హౌస్ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఇష్యూ పరిమాణం సుమారు రూ. 13,000 కోట్లుగా ఉండొచ్చని, వచ్చే నెలలో ప్రారంభం కావొచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నాయి. మార్చి నెలలో కంపెనీ సమర్పించిన ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం ప్రమోటర్లు 20.37 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ఉండదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్యారిస్‌కి చెందిన ఆమండి మధ్య జాయింట్ వెంచర్‌గా 1987లో ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఏర్పాటైంది. ఇందులో ఎస్‌బీఐకి 61.98 శాతం, ఆమండికి 36.40 శాతం వాటాలు ఉన్నాయి. త్రైమాసిక సగటు ప్రాతిపదికన ఎస్‌బీఐ ఎంఎఫ్ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం దాదాపు రూ. 12.5 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇప్పటికే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ మొదలైనవి మ్యుచువల్ ఫండ్ విభాగం నుంచి లిస్టయిన సంస్థల్లో ఉన్నాయి.

**లిస్టులో మరో 4 కంపెనీలు**

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరో నాలుగు కంపెనీల ఐపీవోలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్, శ్రేణి షేర్స్, ఎస్ఆర్ఐటీ ఇండియా ఈ జాబితాలో ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చ్ మధ్యలో ఈ కంపెనీలు ముసాయిదా పత్రాలను దాఖలు చేయగా, జూన్ 16--19 మధ్య సెబీ.. అబ్జర్వేషన్లు ఇచ్చింది. సెబీ పరిభాషలో వీటిని నియంత్రణ సంస్థ ఆమోదంగా పరిగణిస్తారు. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్ మార్చి నెలలో తమ ముసాయిదా పత్రాలను గోప్యతా విధానంలో సెబీకి సమర్పించాయి. స్టాక్ బ్రోకింగ్ సంస్థ శ్రేణి షేర్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూలో 69 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రస్తుత షేర్‌హోల్డర్లు 82 లక్షల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్.. సాధారణ కార్పొరేట్ అవసరాలు, నిర్దిష్ట రుణాల చెల్లింపు మొదలైన వాటి కోసం కంపెనీ




ఉపయోగించుకోనుంది. ఇక ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీవోలో భాగంగా మొత్తం 1.68 కోట్ల షేర్లను తాజా ఇష్యూ కింద కంపెనీ విక్రయించనుంది. ఐపీవో నిధులను ప్రస్తుత ఉత్పత్తుల ఆధునీకరణ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇతర సంస్థల కొనుగోళ్లు మొదలైన వాటి కోసం కంపెనీ విక్రయించనుంది.

## రోడ్డు నాణ్యతపై విచారణ జరపాలి

**జూలపల్లి మండల అభివృద్ధి సాధన సమితి.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**



పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి జూలపల్లి మండల కేంద్రం వరకు ఇటీవల నిర్మించిన డబుల్ రోడ్డు పనుల నాణ్యతపై ప్రజలలో వ్యక్తమవుతున్న సందేహాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర సాంకేతిక విచారణ నిర్వహించాలని జూలపల్లి మండల అభివృద్ధి సాధన సమితి అధ్యక్షుడు మారం తిరుపతియాదవ్ శనివారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసారు. వెంకట్రావుపల్లి, కాచాపూర్, వాడకాపూర్ జూలపల్లి ప్రాంతాలలో నిర్మాణ పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్, రోడ్లు, భవనాల శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తిరుపతి యాదవ్ తెలిపారు.ప్రజా ధనంతో నిర్మించిన రహదారులలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని, అవసరమైతే గుర్తింపు పొందిన ప్రయోగశాలల ద్వారా నమూనాలను పరీక్షించాలని డిమాండ్ చేశారు.ప్రజలందరూ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. ఇట్టి రోడ్డును స్టేట్ హైవే సాధించేవరకు విశ్రమించమని ఎన్ని సంవత్సరాలు అయినా స్టేట్ హైవే కోసం పోరాడతానని హెచ్చరించారు...

## సెయింట్ విన్సెంట్ పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవం

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

అంతర్జాతీయ యోగా దినోత్సవం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలో జరుపుకునే శుభదినంలో ఈ సంవత్సర 2026 యోగా థీమ్ అయిన ఆరోగ్య కరమైన వృధాప్యం కోసం యోగా లో భాగంగా జగదేవపూర్ మండలం అలిరాజపేట సెయింట్ విన్సెంట్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సిస్టర్ జానెట్ యోగ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ పిల్లలు మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలన్న, భావోద్వేగాలను అదుపు చేయాలన్న యోగ ముఖ్యమని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పి .ఈ .టీ యం . శ్రీకాంత్, సిస్టర్ రేణు, సిస్టర్ స్టెఫీ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కు టీఎన్జీఓ సంఘం సన్మానం



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూన్ 20:**

పెద్దపల్లి జిల్లా విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలకు నూతన రూపు తీసుకువచ్చి, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను గణనీయంగా పెరగడంతో పాటు ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారద లను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు అందుకోవడం పట్ల పెద్దపల్లి టీఎన్జీఓ జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టీఎన్జీఓ జిల్లా సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష ని శాలువాతో సన్మానించి పూల బొకే అందించారు. జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు చేసిన కృషి ప్రశంసనీయమని సంఘ నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు బొంకూరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షురాలు గోపు అనిత, ఉపాధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్, స్వప్న, కలెక్టరేట్ వింగ్ అధ్యక్ష కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, ప్రేమ్ సాగర్, కోశాధికారి రామచంద్రం, అలాగే శిల్పా, సౌమ్య, రామదేవి, స్వప్న, ప్రవీణ్, సంతోష్, ప్రచేతన్ తదితర టీఎన్జీఓ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులను హరి గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు దాచరం కనకయ్య విమర్శ**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు దాచరం కనకయ్య విమర్శించారు. శనివారం భరత్ సింహతో మాట్లాడుతూ రైతులు పంటలు పండించడానికి, యూరియా కావాలన్నా డీఏపీ కావాలన్నా 20-20 ఎరువులు కావాలన్నా, 24 గంటల ఉచిత కరెంటు గాని గతంలోని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నేరుగా పిఎసిఎస్ సెంటర్ల నుండి, రైతుల పొలాల్లోకి పంపిన ఘనత కేసీఆర్ ది

రైతులను రాజు చేయడానికి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో కాలేశ్వరం కొండపోచమ్మ మల్లన్న సాగర్ లాంటి అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేశారన్నారు, రాష్ట్రంలో ఉన్నటువంటి 65 వేల చెరువులను కుంటలను పూర్తి చేశామన్నారు, రాష్ట్రంలో 1200 చెక్ డ్యామ్లను నిర్మాణం చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పంటకు కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే విధంగా కేసీఆర్ ముందు చూపుతో అన్ని రకాల వసతులను, యూరియాను, విత్తనాలను, ఎరువులను, కరెంటును, రైతుబంధును, రైతు బీమాను, రైతులు పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమచేసి రైతులకు అన్ని రకాల వసతులను కల్పించి రైతులను రాజును చేసిన ఘనత కేసిఆర్ ది అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి అందుబాటులో ఫార్మ ఇండస్ట్రీని తీసుకొచ్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిది అన్నారు. ప్రతి ఏటా 100 కోట్ల ఖర్చుతో రాజులను బలోపేతం చేయడానికి ఉచితంగా చేపల పంపిణీ చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వాన్నిడి అన్నారు వ్యవసాయ రంగానికి అనుబంధ సంస్థలను బలోపేతం చేసి రాష్ట్రం యొక్క ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కెసిఆర్ ది అన్నారు.

## కలెక్టర్ కు ప్రభుత్వ విప్ ఘన సన్మానం

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూన్ 20:**



పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా పెరగడానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారద చేసిన కృషి ఫలితంగా, జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారదలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శు క్రవారం ప్రత్యేక అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరామరావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షను ప్రత్యేకంగా అభినందించారు. శాలువాతో ఘనంగా సన్మానించారు.

# సోషల్ మీడియాకు గుడ్‌బై చెప్పిన 'ఫంకీ' నటి.. కారణం ఇదే!



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. శరీరానికి ఎలా విశ్రాంతి అవసరమో మనసుకు కూడా అలాంటి బ్రేక్ కావాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు వెల్లడించింది. కొంతకాలం స్క్రీన్‌కు దూరంగా ఉంటూ నిజ జీవితంతో మమేకం కావాలని, తనతో తాను ఎక్కువ సమయం గడపాలని అనుకుంటున్నట్లు ఆమె తెలిపింది. ఈ విషయంపై కయాదు ఇన్‌స్టాలో పోస్ట్ పెడుతూ.. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని రాశారు. ఇన్నిరోజులు నాకు మద్దతుగా నిలిచి, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం అని పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే ఫంకీతో అలరించిన ఈ భామ తెలుగులో నాని సరసన ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తుంది. ఇదే కాకుండా దర్శకుడు మరియప్పన్ చిన్న తెరకెక్కిస్తున్న తమిళ్ హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాలో టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.



# థియేటర్లలో హిట్.. ఓటీటీలోకి అర్జున్ 'బ్లాస్ట్'!

యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా చాలా రోజుల తర్వాత సోలో హీరోగా నటించి థియేటర్లలో భారీ విజయం అందుకున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లాస్ట్'. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం కేవలం పాజిటివ్ మౌత్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రూ.70 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు ఈ సూపర్ హిట్ చిత్రం థియేటర్లలో ఉండగానే ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. జూన్ 25 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. ఒరిజినల్ వెర్షన్ తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఒకేసారి స్ట్రీమింగ్ కానుంది. తెలుగులో ఈ సినిమాను 'బ్లాస్ట్ జోన్' అనే టైటిల్‌తో విడుదల చేయబోతున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ ఈ సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. ఆయన మార్క్ బీజీఎం యాక్షన్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కు ఎలివేట్ చేసింది. అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంతో సుభాష్ కె రాజ్ అనే సరికొత్త దర్శకుడు పరిశ్రమకు పరిచయమయ్యాడు. కథ విషయానికి వస్తే, రాజారామ్ అనే కరాటే మాస్టర్ కుటుంబం చుట్టూ కథ తిరుగుతుంది. రాజారామ్ పిల్లలకు కరాటే శిక్షణ ఇస్తూ, మెడికల్ షాప్ నడుపుతుంటాడు. అతని భార్య నీలవేణి కూడా ఒకప్పుడు కరాటే ఛాంపియనే. వీరి కూతురు నీల ఐటీ ఉద్యోగం చేస్తుంటుంది. రాజారామ్ చిన్నప్పటి నుంచే తన కూతురిని సమాజంలో అన్యాయం జరిగితే ఎదురించేలా ధైర్యంగా పెంచుతాడు. ఒకరోజు లోకల్ రౌడీ కృపాకర్ మెడికల్ షాప్‌లోకి వచ్చి గొడవ చేసి బలవంతంగా మందులు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తాడు. తండ్రి నేర్పిన ధైర్యంతో నీల ఆ రౌడీని చితకబాదుతుంది. పోలీసులు అతన్ని జైల్లో పెడతారు. అయితే ఆ కృపాకర్ గ్యాంగ్‌కు వెనుక మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, హంతకుడైన అబ్రహం ఉంటాడు. ఈ గొడవ కారణంగా అబ్రహం గ్రూప్ నీల కుటుంబంపై పగ పెంచుకుని ఏం చేస్తారు అనేది ఈ సినిమా కథ.

# నటి రుక్మిణి వసంత్ డీప్‌ఫేక్ కేసు.. ముగ్గురు నిందితుల అరెస్ట్



కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఏఐ జనరేటెడ్ ఫొటోలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో షేర్ చేశారనే ఆరోపణలపై బెంగళూరు సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఉపయోగించి 'కాంతార: చాప్టర్ 1' నటి మార్ఫ్ చేసిన విజువల్స్ క్రియేట్ చేశారని, ఆమె పరువుకు భంగం కలిగించే ఉద్దేశంతో వాటిని ఆన్‌లైన్‌లో షేర్ చేశారని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ సందర్భంగా మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న అధికారులు కేసుపై వివరమైన దర్యాప్తు ప్రారంభించారు. ఏఐ జనరేటెడ్ బికినీ ఫొటోలు వైరల్ అయిన తర్వాత నటి రుక్మిణి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వైరల్ అవుతున్న విజువల్స్ పూర్తిగా ఫేక్ అని, వాస్తవం కాదని స్పష్టం చేసిన ఆమె, టెక్నాలజీ దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను చాకచాక్యంగా పట్టుకున్నారు. ఇక తాజాగా నిందితులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, దర్యాప్తు కొనసాగుతున్నందున కస్టడీకి రిమాండ్ చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మార్ఫ్ చేసిన కంటెంట్ క్రియేషన్, సర్క్యులేషన్‌లో మరికొందరు వ్యక్తులు ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# నాగబంధం' కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి తెరపై కనిపిస్తుంది



"జీవితంలో ఎన్నో కలలు, ఎన్నో ఆలోచనలు ఉంటాయి. కానీ, ఒక గొప్ప విజన్‌ను ఆచరణలోకి తీసుకురావాలంటే దాన్ని నమ్మే నిర్మాత అవసరం. మా నిర్మాత కిషోర్‌గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. 'నాగబంధం' సినిమా కోసం ఆయన ఖర్చు చేసిన ప్రతి రూపాయి తెరపై కనిపిస్తుంది" అని డైరెక్టర్ అభిషేక్ నామా తెలిపారు. విరాట్ కర్ణ హీరోగా, నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'నాగబంధం--ది సీక్రెట్ ట్రెజర్'. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించిన ఈ మూవీ జూలై 3న విడుదల కానుంది. శు క్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్రదర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ-- "ఈ చిత్రంలో కనిపించే విజువల్ ఎఫెక్ట్స్ కూడా మన తెలుగు సాంకేతిక నిపుణులు రూపొందించినవే కావడం నాకు మరింత గర్వంగా ఉంది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గ్రాండ్ థియేట్రికల్ అనుభూతిని అందిస్తుంది" అని పేర్కొన్నారు. విరాట్ కర్ణ మాట్లాడుతూ-- "మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న రహస్యాలు, చరిత్రను తర్వాతి తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది" అని చెప్పారు. "మన సనాతన ధర్మం, చారిత్రక అంశాలను అద్భుతంగా ఆవిష్కరించిన చిత్రం 'నాగబంధం'. ఇలాంటి ఎపిక్ కథలో భాగం కావడం నాకు ఆనందంగా ఉంది" అన్నారు నభా నటేష్. "మేమంతా అభిషేక్‌గారి విజన్‌ను నమ్మి ఈ ప్రయాణంలో భాగమయ్యాం" అని ఐశ్వర్యా మీనన్ పేర్కొన్నారు. కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ-- "నాగబంధం' కోసం అందరూ ఎంతో అంకితభావంతో పని చేశారు. ఆ మ్యాజిక్‌ను జూలై 3న ప్రేక్షకులు థియేటర్లలో చూస్తారు" అని తెలి్పిరు. "ఈ సినిమా మొత్తం ప్రయాణంలో దైవానుగ్రహం మాకు అండగా నిలిచింది. ఎన్ని సవాళ్లు వచ్చినా షూటింగ్ ఆగలేదు" అని నిషిత నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సంగీత దర్శకులు అబి--జునైద్, కెమెరామేన్ సౌందర్ రాజన్ మాట్లాడారు.

# సినిమాలకు గుడ్ బై చెప్పనున్న బిగ్ బాస్ బ్యూటీ.. త్వరలో అతనితో పెళ్లి?



త్వరలోనే బిగ్ బాస్ సీజన్ 10 మొదలుకానుంది. ఇప్పటికే 9 సీజన్స్ విజయవంతంగా పూర్తి చేసుకున్న బిగ్ బాస్ గేమ్ షో ఇప్పుడు సీజన్ 10కు సిద్ధం అయ్యింది. కాగా బిగ్ బాస్ ద్వారా ఇప్పటికే చాలా మంది గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా మంది బిగ్ బాస్ పుణ్యమాని క్రేజ్ తెచ్చుకున్నారు. అలాగే కొంతమందికి హీరోయిన్ ఛాన్స్ కు కూడా వచ్చాయి. అలాంటి వారిలో ఇప్పుడు మనం చెప్పుకోబోతున్న హీరోయిన్ ఒకరు. హీరోయిన్ గా కెరీర్ మొదలు పెట్టి తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. కానీ ఆశించిన స్థాయిలో ఆఫర్స్ అందుకోలేకపోయింది. దాంతో బిగ్ బాస్ గేమ్ షోలో ఛాన్స్ అందుకుంది. బిగ్ బాస్ లో తన నటనతో పాటు అందంతో ఆకట్టుకుంది. అలాగే క్రమంలో బిగ్ బాస్ హౌస్ లో తోటి కంటెస్టెంట్ తో లవ్ ట్రాక్ కూడా నడిపింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఈ అమ్మడు ఇప్పుడు సినిమాలకు గుడ్ బై చెప్పేసి పెళ్లి చేసుకోబోతుందని అంటున్నారు. ఆమె ఎవరో కాదు.. మోనాల్ గజ్జర్.. ఈ అందాల భామ చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే ఎక్కువగా గ్లామర్ పాత్రలకే పరిమితమైనప్పటికీ తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరువైందీ అందాల తార. సాధారణంగా సినిమా హీరోయిన్లుగా కొనసాగుతూ ఎవరూ బిగ్ బాస్ లాంటి రియాలిటీ షోలకు వెళ్లరు. కానీ మోనాల్ గజ్జర్ హీరోయిన్ గా కొనసాగుతుండగానే బిగ్ బాస్ తెలుగే సీజన్-4లో కంటెస్టెంట్ గా పాల్గొంది. తన ఆట, మాట తీరుతో బిగ్ బాస్ ఆడియెన్స్ కు బాగా చేరువైంది. అలాగే తోటి కంటెస్టెంట్ తో ప్రేమాయణం నడిపింది. అయితే బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ అందాల తారకు తెలుగులో అవకాశాలు కరువయ్యాయి. దీంతో తన సొంత రాష్ట్రం గుజరాత్ కు వెళ్లిపోయింది. ప్రస్తుతం అక్కడే సినిమాలు, టీవీ షోలు చేస్తూ బిజి బిజీగా ఉంటోంది. మోనాల్ సినిమాల విషయానికొస్తే సుడిగాడు సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ అయ్యింది. ఆ తర్వాత రెండు మూడు సినిమాలు చేసింది. 2014లో బ్రదర్ ఆఫ్ బొమ్మాళి అనే సినిమాలో నటిగా కనిపించింది మోనాల్. తర్వాత గ్యాప్ తీసుకొని మళ్లీ 2021లో అల్లుడు అదుర్స్ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ తో సందడి చేసింది. ఆ తర్వాత తెలుగు తెరపై కనిపించలేదు. ప్రస్తుతం ఈ బ్యూటీ గుజరాతి సినిమాలు, వెబ్ సిరీస్ లు, టీవీ షోలతో బిజీగా ఉంటోంది. ఇదిలా ఉంటే ఈ అమ్మడు అఖిల్ తో బిగ్ బాస్ లో ప్రేమాయణం సాగించింది. బయకు వచ్చిన తర్వాత కూడా ఈ ఇద్దరూ కలిసి పలు షోల్లోనూ పాల్గొన్నారు. ఇక ఇప్పుడు ఈ ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని టాక్ వినిపిస్తుంది. మోనాల్ సినిమాలకు గుడ్ బై చెప్పేసి అఖిల్ పెళ్లి చేసుకొని సెటిల్ అవ్వనుందని టాక్ వినిపిస్తుంది. మరి ఈ వార్తల్లో వాస్తవమెంత అన్నది తెలియాల్సి ఉంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com